





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 26 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | ఆదివారం 8 ఫిబ్రవరి 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 26 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : TIRUPATI | SUN 8 FEBRUARY 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

# ఇది చారిత్రక ఘట్టం

- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన
- ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య
- క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా
- హైదరాబాద్‌కు హైటెక్ సిటీలా, దేశానికి క్వాంటమ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అవుతుందని ప్రకటన
- ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి



"ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని

- మిగతా 2లో



## వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు...

# జగన్ కు ఏంటి బాధ?

- తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందన్న శ్రీనివాసవర్మ
- కల్తీ జరిగిందని వైవీ, భూమన, చెవిరెడ్డి ఇప్పుకున్నారని వ్యాఖ్య
- స్వామివారికి హారతి ఇచ్చే నెయ్యిని కల్తీ చేశారని మండిపాటు

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ నివేదిక ప్రకారం నిబంధనల ఉల్లంఘన జరిగిందని చెప్పారు. లడ్డూల తయారీకి ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని అన్నారు. కానీ, ఈ వ్యవహారంలో వైసీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదంగా

- మిగతా 2లో



## సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు...

### కదిలిపోయిన పవన్ కల్యాణ్

- బురద రోడ్డుపై విద్యార్థుల ఆవేదన.. సోషల్ మీడియాలో వీడియో
- వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- గజ్జలవారిపల్లికి రూ.86 లక్షలతో తక్షణమే రోడ్డు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో ఉదయగిరిలో రూ.55 కోట్ల రోడ్ల పనులు
- ఈ రోడ్డు మంజూరుతో విద్యార్థులు, రైతుల కష్టాలకు తెర

"పవన్ సర్.. రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేకపోతున్నాం. దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి" అంటూ విద్యార్థులు

- మిగతా 2లో




## ఎడిటర్ వ్యూ

# అంగరంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు

తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకే గిరిశృంగం ద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైన ఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదళీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు. శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం – శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు దుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178–1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి.ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 8తేదీ నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 8న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఆంధప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీశైలం క్షేత్ర మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం పట్టువస్త్రాలు అందజేస్తారు. 15వ తేదీన మహా శివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ప్రభోత్సవం, నంది వాహన సేవ. లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం, కళ్యాణోత్సవం నిర్వహించ నున్నారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారు వివిధ వాహనాలను అధిరోహించి, తిరు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహం కలిగిస్తారు. ప్రత్యేకించి మహాశివరాత్రి నాడు స్వామి వారికి ప్రభోత్సవం, నందివాహన సేవలతో పాటు అనేక విశేష కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుంది. జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాములకు మాత్రమే నిర్దిష్ట వేళల్లో ఉచిత స్పర్శ దర్శనానికి అవకాశం ఉంటుంది.

# శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు... సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం అందింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ బోర్డు ఛైర్మన్ రమేశ్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు నేడు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు.ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబుకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆయనకు ఆశీర్వచనం అందించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, ఆలయ బోర్డు సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు.దీనిపై స్పందించిన సీఎం, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు,

భద్రత, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా హాజరుకావాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సీఎం చంద్రబాబును ఆహ్వానించారు.

# వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు... జగన్ కు ఏంటి బాధ?

- మొదటి పేజి తరువాయి

ఉన్నాయని విమర్శించారు. కల్తీ నెయ్యి విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముగ్గురూ కల్తీ జరిగిందని ఒప్పుకున్నారని శ్రీనివాసవర్మ అన్నారు. కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు... జగన్ కు ఏంటి బాధ అని ప్రశ్నించారు. బోలేబాబాకు పాల ఉత్పత్తి, డెయిరీ లేకపోయినా నెయ్యి తయారు చేశారని వివరించారు. టెండర్ల నిబంధనల్లో పెద్ద ఎత్తున మార్పులు చేశారని... అవినీతి కోసం అలా చేశారని అన్నారు. ఆ నెయ్యితోనే స్వామివారికి హారతి ఇస్తామని... అలాంటి నెయ్యిని కల్తీ చేశారని మండిపడ్డారు. అర్హత లేని వారికి నెయ్యి కాంట్రాక్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారుశ.

# భారత వ్యాక్సిన్లు రాకపోవడం మా ఆర్థిక వ్యవస్థకు భారంగా మారింది

పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ నుంచి అందుబాటు ధరల్లో లభించే వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడం పాకిస్థాన్‌కు ఆర్థికంగా భారంగా మారిందని ఆ దేశ ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ వెల్లడించారు. భారత వ్యాక్సిన్లు గత ఏడాది నుంచి రావడం లేదని అన్నారు. వీటి దిగుమతి కోసం వందల మిలియన్ డాలర్లు ఖర్చవుతోందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందన్నారు.

ప్రస్తుతం ప్రతి సంవత్సరం 400 మిలియన్ డాలర్లతో వ్యాక్సిన్లను దిగుమతి చేసుకుంటున్నామని, వీటిలో 49 శాతం ఖర్చులను 'గావీ' (గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్) ద్వారా పని చేసే అంతర్జాతీయ సంస్థలు, మిగతా 51 శాతం ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. స్థానికంగా వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రారంభించకపోతే 2031 నాటికి దిగుమతి కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికి వ్యాక్సిన్ల సరఫరాకు అంతర్జాతీయ సహకారం ముగిసిపోతుందని అన్నారు.అత్యంత పేద దేశాల్లోని పిల్లలకు వ్యాక్సిన్ అందించడానికి 'గావీ' పనిచేస్తుంది. 'గావీ' సాయంతో పాకిస్థాన్ అత్యంత చౌకగా టీకాలను సేకరించేది. వీటిలో ఎక్కువగా భారత్ నుంచే వస్తాయని, అవి అందుబాటు ధరల్లో ఉంటాయని పాకిస్థాన్ మంత్రి

వెల్లడించారు. కరోనా సమయంలో లక్షలాది కొవిడ్ వ్యాక్సిన్లను భారత్ నుంచి సేకరించడానికి 'గావీ' సహాయం చేసిందని అన్నారు.పాకిస్థాన్ ప్రభుత్వం ప్రస్తుతం పౌరులకు 13 రకాల వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తోంది. అయితే ఏ వ్యాక్సిన్‌ను కూడా స్థానికంగా ఉత్పత్తి చేయడం లేదు. 24 కోట్ల జనాభాతో ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ఐదో దేశంగా పాకిస్థాన్ ఉంది. ప్రతి సంవత్సరం 62 లక్షల జననాలు నమోదవుతుండటంతో వ్యాక్సిన్లకు డిమాండ్ పెరిగింది.

# సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు... కదిలిపోయిన పవన్ కల్యాణ్

చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, కొండాపురం మండల పరిధిలోని గజ్జలవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి 1.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 86 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గజ్జలవారిపల్లి విద్యార్థులకే కాకుండా, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి కష్టాలు తీరనున్నాయి.ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదయగిరి నియోజకవర్గంలో ఇప్పటికే 'పల్లెపండగ 1.0, 2.0', సాస్కీ నిధులతో కలిపి సుమారు రూ. 55 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టుల కింద మొత్తం 641 రోడ్ల నిర్మాణం జరుగుతోంది. వీటికి అదనంగా, తాజాగా విద్యార్థుల అభ్యర్థన మేరకు గజ్జలవారిపల్లి రోడ్డును ప్రత్యేకంగా మంజూరు చేయడం గమనార్హం.

# పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించొద్దు

బడ్జెట్ లో ఏపీకి పెద్ద పీట వేశారని... రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులకు రూ. 10,134 కోట్లు, అమరావతి కోసం రూ. 1,120 కోట్లు కేంద్ర బడ్జెట్ లో కేటాయించారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్రం సాయంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను సాధించిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు కేంద్రం నిధులు ఇస్తోందని తెలిపారు. రాష్ట్రానికి బలమైన పునాదులు పడుతున్నాయని... పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించవద్దని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఎన్నో విజయాలను సాధిస్తోందని రామ్మోహన్ నాయుడు కొనియాడారు. వికసిత్ భారత్ దిశగా దేశం దూసుకుపోతోందని అన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి, దేశ శ్రేయస్సే లక్ష్యంగా మోదీ ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశ ప్రజల భవిష్యత్తును నిర్దేశించే విధంగా, యువత ఆశయాలు, ఆకాంక్షలు ప్రతిబింబించేలా కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. రాబోయే 20 ఏళ్ల పాటు 7 శాతం వృద్ధి రేటు కొనసాగేలా నిర్మలా సీతారామన్ బడ్జెట్ ను రూపొందించారని కితాబునిచ్చారు.

# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం.. ఇది చారిత్రక ఘట్టం

- మొదటి పేజి తరువాయి

వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం"

అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు.

అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే

- మొదటి పేజి తరువాయి

ప్రాజెక్టు విషయంలో ఇరువురు నేతల వైఖరిని ఆమె తప్పుబట్టారు.వైసీపీ ప్రభుత్వంపై షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్ల పాలనలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అంశంలో నిద్రపోయిన వైసీపీ, ఇప్పుడు ఓటమి తర్వాత ఉద్యమాలు చేయడం సిగ్గుచేటు" అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్జీటీ వద్ద బలమైన వాదనలు వినిపించకుండా, కేంద్రం నుంచి అనుమతులు తీసుకురాకుండా ఇప్పుడు ఆందోళనలు ఎందుకని ప్రశ్నించారు. "ఐదేళ్లు ప్రధాని మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్‌కు అప్పుడు సీమకు నీళ్లివ్వాలని గుర్తుకురాలేదా?" అని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులను 6 నెలల్లో పూర్తి చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, సీమ ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆమె విమర్శించారు.

మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు సంగమేశ్వరం వద్ద కాకుండా ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కడతామని చెప్పడాన్ని కూడా షర్మిల తప్పుబట్టారు. "ఎవరిని మోసం చేయడానికి ఇద్దరూ కలిసి ఈ నాటకాలు ఆడుతున్నారు? మోదీ దగ్గర సాగిలపడి సీమకు అన్యాయం చేస్తారా?" అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. ఇద్దరు నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని, సీమ ప్రయోజనాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడులు..

బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఏరోస్పేస్ సంస్థ 'స్పేస్‌ఎక్స్' వ్యవహారంపై సమీక్ష జరపాలని ఇద్దరు అమెరికన్ డెమొక్రటిక్ సెనేటర్లు డిమాండ్ చేశారు. ఈ సంస్థలో చైనాకు చెందిన పెట్టుబడిదారులు రహస్యంగా వాటాలు కొనుగోలు చేశారని, ఇది అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రక్షణ శాఖ (ఋణ) కార్యదర్శి పీట్ హెగ్సెత్‌కు వారు లేఖ రాశారు. మసాచుసెట్స్ సెనేటర్ ఎలిజబెత్ వారెన్, న్యూజెర్సీ సెనేటర్ ఆండీ కిమ్.. రక్షణ శాఖకు రాసిన లేఖలో ఈ ఆందోళనలను ప్రస్తావించారు. స్పేస్‌ఎక్స్ రక్షణ శాఖకు ఒక ప్రధాన కాంట్రాక్టర్‌గా ఉందని గుర్తుచేశారు. ఇటీవల బయటపడిన కోర్టు రికార్డులు, మార్చిలో వచ్చిన ఒక ప్రోపబ్లికా పరిశోధనాత్మక కథనాన్ని వారు తమ లేఖలో ఉటంకించారు. ఆఫ్‌షోర్ ఖాతాల ద్వారా స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడిదారులకు వాటాలు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారని ఈ నివేదికలు ఆరోపిస్తున్నాయి."వ్యూహాత్మక రంగాల్లో ప్రత్యర్థి దేశాల నుంచి వచ్చే విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇది విరుద్ధం. కీలకమైన సైనిక, నిఘా, పౌర మౌలిక సదుపాయాలను ఇది ప్రమాదంలో పడేస్తుంది" అని సెనేటర్లు పేర్కొన్నారు. రక్షణ శాఖతో స్పేస్‌ఎక్స్‌కు 5.9 బిలియన్ డాలర్ల లాంచ్ సర్వీస్ కాంట్రాక్టుతో సహా బిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందాలున్నాయి.

"మన జాతీయ భద్రతా వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న స్పేస్‌ఎక్స్ లాంటి సంస్థపై చైనా వంటి ప్రత్యర్థి దేశం పెత్తనం చెలాయించగలిగే అవకాశం ఉండడం ప్రమాదకరం" అని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని చైనా పెట్టుబడిదారులు తెలుసుకుని, అమెరికా జాతీయ భద్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందని సెనేటర్లు హెచ్చరించారు. స్పేస్‌ఎక్స్‌లో చైనా ప్రభావంపై తాము లేవనెత్తిన ప్రశ్నలకు, ఈ భద్రతాపరమైన ఆందోళనలను పరిష్కరించడానికి డీఓడీ ఎలాంటి చర్యలు తీసుకోబోతోందో ఫిబ్రవరి 18లోగా తెలియజేయాలని వారు తమ లేఖలో కోరారు.

# 'అరెస్ట్' ఎప్పుడు చేయాలంటే.. పోలీసులకు సుప్రీం కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు సతేందర్ కుమార్ అంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కే సింగ్ ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛతో కూడుకున్న విషయం కాబట్టి అరెస్టుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులకు సూచించింది.

**సుప్రీం బెంచ్ సూచనలు ఇవే..**

క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదు అందిన తర్వాత రెండు దశల పద్ధతిని పాటించాలని దర్యాప్తు అధికారికి కోర్టు సూచించింది. సదరు కేసు విచారణలో అరెస్టు తప్పనిసరా? కాదా?.. బీఎన్ఎస్ సెక్షన్ 33, సెక్షన్ 35 ప్రకారం అరెస్టు చెయ్యవచ్చా? లేదా? అనేది వ్యక్తిగతంగా నిర్ణయించుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఆర్టికల్ 21 (వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు) ప్రకారం పౌరులకు కల్పించిన హక్కుల ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని; నిందితుడు, సహ నిందితుడనే భేదాలు ఏవీ మినహాయింపు కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో అరెస్టుకు సంబంధించి పోలీసులకు చట్టం కల్పించిన మినహాయింపులనూ సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బీఎన్ఎస్ సెక్షన్ 35(1)(బి) ప్రకారం.. ఎలాంటి వారెంట్ లేకున్నా పోలీసులు అరెస్టు చేయవచ్చనే నిబంధనను ప్రస్తావిస్తూ.. ఈ రూల్ ప్రకారం వారెంట్ లేకుండా ఎవరినైనా అరెస్టు చేయొచ్చని భావించరాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

# కావలిలో 400 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

## 6 ఏ కేసు నమోదు చేసిన విజిలెన్స్ అధికారులు

కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 7 కావలి పట్టణం మద్దూరుపాడు లోని శ్రీ లక్ష్మీనరసింహా ట్రేడర్స్ రైస్ మిల్లులో శనివారం అక్రమంగా నిల్వ ఉంచిన 400 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి పట్టుకున్నారు. జిల్లా విజిలెన్స్ సిఐ శ్రీహరి మాట్లాడుతూ విజిలెన్స్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, ఆయనకు రాబడిన సమాచారంతో మిల్లు లో తనిఖీలు చేపట్టామన్నారు. విజిలెన్స్, సివిల్ సప్లై, పోలీస్ శాఖల ఉమ్మడి ఆపరేషన్ లో రైస్ మిల్లు పై దాడులు చేసి అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మిల్లు యజమాని మదన్ మోహన్ రెడ్డి పై క్రిమినల్ కేసుకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. అలాగే జాయింట్ కలెక్టర్ కోర్టులో నిత్యవసర వస్తువుల యాక్ట్ కింద 6 ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# నగర పాలక సంస్థ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలామ్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు.





నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7.
ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగర పాలక సంస్థ అన్ని డివిజనుల కౌన్సిల్ సభ్యుల సమక్షంలో 14 మెయిన్ అజెండా, 13 సప్లిమెంటరీ అజెండా, 11 టేబుల్ అజెండాలుగా మొత్తం ప్రవేశపెట్టిన 38 తీర్మానాలను అజెండాగా ప్రకటించగా, అన్ని తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అజెండాలోని అన్ని అంశాలు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఆరోగ్య భద్రత, నగరాభివృద్ధి ధ్యేయంగా రూపొందించబడినవని, అన్ని డివిజన్లకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను అజెండాలో పొందుపరిచామని తెలిపారు. ప్రధానంగా దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్త చర్యలను నగరపాలక సంస్థ పరిధిలో ప్రణాళిక బద్ధంగా చేపట్టేందుకు కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. భూగర్భ డ్రైన్ కనెక్షన్ కు ప్రతి ఒక్క గృహం అనుసంధానించేలా అవగాహన కల్పించాలని స్థానిక కార్పొరేటర్ లకు మేయర్ సూచించారు. నగర అభివృద్ధికి అవసరమైన మూలధనం ఏర్పాటు కోసం ప్రభుత్వం రూపొందించిన బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్ పరకాలపై స్థానిక ప్రజలందరికీ అవగాహన కల్పించి ఆయా పథకాలను సద్వినియోగం చేసుకునేలా స్థానిక కార్పొరేటర్లు కృషి చేయాలని మేయర్ సూచించారు. మున్సిపల్ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ పి. నారాయణ, రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల సారధ్యంలో, అన్ని డివిజన్ల కార్పొరేటర్ల సహకారంతో, నెల్లూరు నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారుల పర్యవేక్షణలో నగరాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని కార్పొరేషన్ మేయర్ పేర్కొన్నారు.
కార్పొరేషన కమిషనర్ అన్ని విభాగాల అధికారులు సిబ్బందితో పాటు నగర ప్రజలందరి సహకారంతో నెల్లూరు నగర పాలిక సంస్థ ఉన్నతి సాధించేలా సమానవ్యంగా కృషి చేస్తామని మేయర్ ఆకాంక్షించారు ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్ కో ఆప్షన్ సభ్యులు నగర పాలక సంస్థ డివిజన్ల ఆపరేటర్లు కమిషనర్ వై ఓ నందన్ నగరపాలిక సంస్థ అన్ని విభాగాల ఉన్న అధికారులు పాల్గొన్నారు

# నెల్లూరు జిల్లాలో రెండున్నర వేల ఎకరాల వక్ఫ్ భూమి ఉంది.

**వాటిలో కొన్ని అన్యాక్రాంతమయ్యాయి, కొన్నిటికి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి.**

**వాటిని గుర్తించి రిజిస్ట్రేషన్లు క్యాన్సిల్ చేయమని జిల్లా కలెక్టర్ కు ఇచ్చాం.**

**65 వేల ఎకరాలు ఉన్న వక్ఫ్ భూమిని 80 వేల ఎకరాలకు తీసుకుని వచ్చాం.**

**ఉమీద్ పోర్టల్ డిజిటలైజేషన్ను భారతదేశంలోనే ఏపీ 100 శాతం పూర్తిచేసింది.**

**ప్రతినెల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం జరగాలి.**





నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7.
ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ నెల్లూరు నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం లో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు వక్ఫ్ విషయాల పై చర్చించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, నెల్లూరు జిల్లాలో 2500 వేల ఎకరాల వక్ఫ్ భూమి ఉందని వాటిలో కొంతమేరకు అన్యాక్రాంతమయ్యాయని మరికొన్నిటికీ దొంగ పాస్ బుక్ లు తయారు చేసుకుని ఉన్నారని తెలిపారు. వాటిని గుర్తించి జిల్లా కలెక్టర్ కు అందజేశామని వాటి అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని కోరామని మంగళవారం లోపు యాక్షన్ తీసుకుంటామని తెలిపినట్లు వివరించారు. ఉమీద్ పోర్టల్ లో వక్ఫ్ ఆస్తులను డిజిటలైజ్ చేసామని భారతదేశ వ్యాప్తంగా గెజిటెడ్ వక్ఫ్ ఆస్తులను మొట్టమొదట ఏపీ వక్ఫ్ బోర్డ్ 100% పూర్తి చేసిందని తెలిపారు. గతంలో 65 వేల ఎకరాలు గా ఉన్న వక్ఫ్ భూమిని, గెజిట్లు ఐఎఫ్ఆర్ లు, రికార్డులు అన్ని పరిశీలించి వాటిని 81 వేల ఎకరాలుగా గుర్తించి పోర్టల్ లో నమోదు చేశామని తెలిపారు. దేవాలయాల భూములు కాపాడినట్లు వక్ఫ్ భూములను కూడా కాపాడాలని చంద్రబాబు తనకు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం అన్ నోటిఫైడ్ వక్ఫ్ ఆస్తులను డిప్టిలైజ్ చేయాలని, వాటికి అవసరమైన పత్రాలను త్వరిత గతిన అర్జీదారులకు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతినెల నిర్వహించాల్సిన వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ ను బిజి షెడ్యూల్స్ వల్ల నిర్వహించలేకపోయారని భవిష్యత్తులో ప్రతినెల నిర్వహించాల్సిందిగా సూచించినట్లు తెలిపారు ఆస్తులను రక్షించుటమే కాదు వాటి ద్వారా ఆదాయాన్ని పెంచే సమీక్ష చేయాలని తెలిపారు నెల్లూరులోని వక్ఫ్ భూముల్లో మంత్రి నారాయణ ఇరవై కోట్ల రూపాయలు సిఎస్సార్ నిధులతో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తునామని కసుమూరులో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని సిల్క్ డెవలప్మెంట్ కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తిగా మరో నాలుగు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ప్రారంభిస్తామని శుభవార్త చెప్పారు భవిష్యత్తులో మరిన్ని సమీక్ష కార్యక్రమాలు చేపడతామని ముస్లిం సమాజానికి అండగా నిలబడతామని అన్నారు కార్యక్రమంలో నన్నే సాహెబ్ ఇంతియాజ్ పాషా మొహిదీన్ నేషాద్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు

# అవసరం లేకున్నా పట్టా భూముల్లో ఉన్న ఇంటిని కూల్చేశారు..



నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7.
మంత్రి నారాయణ కు చెడ్డ పేరు తేవడానికా!
కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికా! మున్సిపల్ కమిషనర్ వివరణ ఇవ్వాలని బిజెపి నేత మిడతల రమేష్.. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సమాధి శ్రీనివాసులు సంయుక్తంగా డిమాండ్ చేశారు..మూలపేట రామిరెడ్డి డ్రైన్ కాలవ మరమ్మతుల సందర్భంగా పాములు మన్యం పట్టా భూముల్లో ఉన్న ఇంటిని మున్సిపాలిటీ కొలగొట్టింది..బిజెపి పార్టీకి చెందిన నిరుపేద బీసీ కుటుంబానికి అన్యాయం జరగకూడదని ముందస్తుగా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడడం జరిగింది..ప్రస్తుతం నిర్మిస్తున్న కాలువ తూర్పు భాగానికి కలపడం కోసం కచ్చితంగా వంపు తిప్పాల్సి ఉంది.
ఇల్లు పడకుండా అడ్డుగా ఉన్న కానుక చెట్టును మిషనరీ తో తీయమని అధికారులను కోరితే ఉన్న ఇల్లు నే కూల కొట్టారు. 70 సంవత్సరాలుగా నివసిస్తున్న ఆ పట్టా భూమిని 15 సంవత్సరాల క్రితం కోర్టు రిజిస్టర్ చేయడం జరిగింది ప్రభుత్వానికి ఆ భూమి అవసరం అయితే పట్టాదారునికి నోటీసు ఇవ్వడన్ని మున్సిపల్ కమిషనర్ అవమానంగా భావించినట్లయితే కోర్టు కన్నా నోటీసు ఇవ్వాల్సి ఉంది..నోటీసులు లేకుండా ఇరిగేషన్ అధికారులకు రెవెన్యూ అధికారులకు తెలుపకుండా నిరుపేద బీసీ కుటుంబం కూల్చేశారు..రామిరెడ్డిడ్రైన్ లో చేస్తున్న నిర్మాణాలు సుప్రీంకోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న విషయాన్ని మున్సిపల్ ఇరిగేషన్ అధికారులు గుర్తుకు తెచ్చుకోవాలని రమేష్ ఈ సందర్భంగా తెలిపారు. అధికారులను గౌరవించి విజ్ఞప్తి చేస్తే దుర్మార్గంగా మున్సిపల్ కమిషనర్ ఎందుకు వ్యవహరించారు.? అతని మనసులో కోటమి ప్రభుత్వానికి గాని మంత్రి నారాయణకు గాని చెడ్డ పేరు తేవాలని తలంపు ఉన్నట్లుంది.. వెంటనే కూల్చేసిన ఇంటిని తిరిగి పునర్ నిర్మించాలి..లేకుంటే లోకాయుక్త లో న్యాయం కోసం పిటిషన్ దాఖలు చేస్తామని రమేష్ తెలిపారు..ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు రాజేశ్వరమ్మ విజయశ్రీ పద్మావతి సుజన ఆదినారాయణ ప్రభావతి చిట్టిబాబు దాసరి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# మోటార్ సైకిల్ ప్రమాదం జరిగిన తాపీ మేస్త్రీలకి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆర్థిక సాయం





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 7.
ఇటీవల. రేబాల గ్రామమునందు.బేలుదారు పనికి వెళ్లి వస్తున్న. ఇద్దరు వ్యక్తులకు జరిగిన.మోటార్ సైకిల్ ప్రమాదము నందు. గాయపడిన. పడమటి హరిజనవాడకు చెందిన. ఆ మారి నారాయణ గురజాల వెంకటేశ్వర్లు. పనిచేసుకోలేని స్థితిని గమనించిన టిడిపి నాయకులు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళగా. ఎమ్మెల్యే సహృదయంతో స్పందించి. వారి కుటుంబ పోషణ నిమిత్తము ఆర్థిక సహాయాన్ని ప్రకటించి.రేబాల టిడిపి నాయకుల వద్దకు. ఆర్థిక సహాయాన్ని. పంపించినారు. రేబాల టిడిపి నాయకులు. శివరామ కృష్ణారెడ్డి గ్రామ అధ్యక్షులు. తూపిలి వెంకటరామిరెడ్డి. మండల టిడిపి కోశాధికారి సుధీర్ రెడ్డి . సదరులు ఛానల్ ఉపాధ్యక్షులు. నెల్లూరు రమణారెడ్డి . మస్తానయ్య . బాధితులకు. ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధితులు మరియు రేబాల టిడిపి నాయకులు. ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

# గుమళ్లదిబ్బ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ప్రశాంతమ్మ పరామర్శ



కోవూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7.
ఫోన్ చేసి పరామర్శించిన ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ. ఘటనపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు. కోవూరు మండలం గుమళ్లదిబ్బ కొత్త కాలనీలో బాలిక మృతి ఘటనపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే ఆమె స్పందించి చెన్నైలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. బాలిక తల్లిదండ్రులతో మాట్లాడిన ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి తాను అన్నివిధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఘటనపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# పాఠశాలల ఉన్నతికి "విద్యాంజలి"



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ 7.
పాఠశాలలలో విద్యాప్రమాణాలు, మౌలిక సదుపాయాలను సమాజ భాగస్వామ్యంతో అనుసంధానం చేసి మెరుగుపరచడానికి విద్యాంజలి కార్యక్రమం ఉపయోగపడుతుందని మండల విద్యాశాఖ అధికారి ఎం. దిలీప్ కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం డిఎల్ఎన్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన, నైపుణ్యాలు, సహ పాఠ్య కార్యక్రమాలకు ఈ కార్యక్రమం ఒక అద్భుత వేదిక అన్నారు. విద్యాంజలి కార్యక్రమంలో వాలంటీరు, ఎన్జీవోస్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద పాఠశాలల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడానికి వీలవుతుందన్నారు. యు డైస్ నెంబర్ కలిగిన ప్రతి పాఠశాల విద్యాంజలి పోర్టల్ లో నమోదు చేసుకుని వారికి కావలసిన సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా పివి రత్నం, ఓ వెంకటేశ్వరరావు, గండికోట సుధీర్ కుమార్ వ్యవహరించి ఆన్లైన్లో పాఠశాలను ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, సేవలను ఎలా వినియోగించుకోవాలి అనే కార్యక్రమం పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్లు పాల్గొన్నారు.

# వైసీపీ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కసునూరు రాఘునాథ్ రెడ్డి



పెన్ పవర్, అనంతపురం అర్బన్ ఫిబ్రవరి 07:
అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన కసునూరు రాఘునాథ్ రెడ్డి గారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యులు మీసాల రంగన్న, రాష్ట్ర కార్యదర్శి గౌస్ బేగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, గువ్వల రాజేష్ రెడ్డి, వెన్నం శివారెడ్డి, పులంపల్లి రవి, పూలకుంట కృష్ణా రెడ్డి, శ్రీదేవి, కేఎల్ దేవి, సాకం నారాయణ రెడ్డి, నిమ్మల నాగరాజు పాల్గొన్నారు.అలాగే కార్పొరేటర్లు టీవీ చంద్రమోహన్ రెడ్డి, మాలపాటి శ్రీనివాసులు, గోగుల రాధాకృష్ణ, వడ్డే రామచంద్ర, అనిల్ కుమార్ గౌడ్, జానీ, రవి, కిషోర్ తదితరులు హాజరై రాఘునాథ్ రెడ్డిని అభినందించారు.పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా కసునూరు రాఘునాథ్ రెడ్డి తెలిపారు.

# పిల్లలపై జరిగే లైంగిక దాడులను నివారిద్దాం



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 07,
గంగవరం మండలం నందు అన్ని గ్రామాల్లోని పిల్లలపై ఇకపై ఎటువంటి లైంగిక దాడులు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని మండల స్థాయి అధికారులు సూచించారు.ఈమేరకు శనివారం గంగవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నందు పిల్లలపై లైంగిక దాడులను నివారణకై అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా గంగవరం ప్రధానవైద్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ..చిన్న పిల్లల నుండీ ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులు మరియు గ్రామాల్లోని ఇతర బాలలపై ఎటువంటి అత్యాచారాలు జరగకుండా అన్ని శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో నిర్వహించాలని కోరారు.ఇందులో అంగన్వాడీ,వైద్యసిబ్బంది,విద్యాశాఖాధికారులుకలిసి నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ వైద్యులు మల్లికార్జునరెడ్డి,పెద్దపంజాని వైద్యులు మురళి,గంగవరం వైద్యులు లహరి, విద్యాశాఖాధికారులు వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు,అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు మరియు వైద్యసిబ్బంది పాల్గొన్నారు

# మహిళలు పురుషులకు ధీటుగా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 07,
మహిళలు పురుషులకు ధీటుగా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు.స్వయం సహాయక సంఘ సభ్యులకు శనివారం ఆయన ఈ –సైకిళ్లను పంపిణీ చేసి,ఆయన స్వంతంగా నడిపి చూపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు.దాంతోపాటు ప్రతి మహిళ ఓ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్న లక్ష్యంతో విరివిగా రుణాలు సైతం అందిస్తున్నామన్నారు.రాష్ట్రంలో ఏ ప్రభుత్వమైనా ఎక్కువ కాలం కొనసాగితేనే అభివృద్ధి,సంక్షేమం పరుగులు పెడతాయని అన్నారు.ప్రజలు,మహిళలు ఈ విషయాన్ని గమనించి రాబోయే ఎన్నికల్లో సైతం కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలబడి అభివృద్ధి,సంక్షేమానికి బాటలు వేయాలన్నారు. అనంతరం మహిళలకు బ్యాంక్ లింకేజి,శ్రీనిధి చెక్కులను,ఈ– సైకిళ్లు పంపిణీ చేశారు.ఇలా ఉండగా ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు మహిళలు పెద్ద ఎత్తున పూలుచల్లి అపూర్వ స్వాగతం తెలియజేశారు.ఈ సైకిళ్ల పంపిణి అనంతరం ఎమ్మెల్యే సైతం కొంతదూరం సైకిల్ తొక్కి అక్కడివారిని ఉత్తేజపరిచారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రేఖా, ఎంపీడీఓ సురేష్ బాబు, వెలుగు ఏపీఎం మీరాబాయ్,మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, కార్యదర్శి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు,యువత అధ్యక్షులు గిరిధర్ గోపాల్,ఎస్సి సెల్ అధ్యక్షులు రవి,సింగిల్ విండో డైరెక్టర్లు హరిబాబు,శివరామి రెడ్డి,జిల్లా నాయకులు బత్తిగౌడ్,మురళి,బాలాజీ,జయసింహ,యుగంధర్,తాజ్ రెడ్డి,జనసేన నాయకులు చందు, తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్‌కు చెందిన కాల్వ సందీప్ రూ.1,00,016/-ల చెక్కు అందజేత.

శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి, 07 :
శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కరీంనగర్‌కు చెందిన కాల్వ సందీప్ రూ.1,00,016/–లను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి టి. బాపిరెడ్డికి స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేకంగా అంతరాలయ దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం దర్శనానంతరం ఆలయ పండితులు భక్తుడికి ఆశీర్వాదం అందజేసి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.భక్తుల సహకారంతో నిత్య అన్నదాన పథకం మరింత విస్తృతంగా కొనసాగుతోందని ఆలయ అధికారులు తెలిపారు.



# నెల్లూరు నగరంలో డంపు చేసిన పిడిఎస్ రైస్ పట్టివేత

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7.
నెల్లూరు నగరంలోని స్టోన్ హౌస్ పేట బివిఎస్ స్కూల్ ఎదురుగా ఉన్నటువంటి లక్ష్మీ సాయినగర్ లో అక్రమ రవాణా చేసేందుకు ఇంట్లో డంప్ చేసిన పిడిఎస్ బియ్యంను శనివారం వచ్చిన సమాచారం మేరకు నెల్లూరు సివిల్ సప్లై ఏఎస్ఓ లక్ష్మీనారాయణ రెడ్డి, కోవూరు డిప్యూటీ తాసిల్దార్ కే బాలకోటమ్మ పొదలకూరు రవి, ఆ డంపు చేసిన ఇంటి మీద దాడిలు నిర్వహించారు.600 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని డమ్ చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఓ లక్ష్మీనారాయణ రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు.వారితో టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం, విఆర్ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

# విద్యార్థుల పరిశుభ్రతకు కౌన్సిలర్ సూరా భాస్కరరెడ్డి చొరవ

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ముస్తాబు సామగ్రి పంపిణీ**



ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7.
ఆత్మకూరు పట్టణ 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కరరెడ్డి తమ వార్డు పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ముస్తాబు కార్యక్రమంలో వినియోగించేందుకు అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సబ్బులు, సబ్బు పెట్టెలు, బొట్టు బిల్లల ప్యాకెట్లు, తువ్వాళ్లు, దువ్వెనలు, పౌడర్ డబ్బాలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి కి అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్తులో పాఠశాలకు అవసరమైన కుర్చీలను కూడా అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి గాను పాఠశాల హెచ్.ఎం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు సూరా భాస్కరరెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్.ఎం తో పాటు ఉపాధ్యాయులు, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ బాబు ను కలిసిన టిడిపి నేత వర్ధినేని మురళీ నాయుడు



కావలి ఆర్ సి ఇన్చార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 7
జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు మంగళగిరిలో నిర్వహించిన బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో జలదంకి మండలం రామవరప్పాడు టీడీపీ నాయకుడు వర్ధినేని మురళి నాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
వర్క్‌షాప్ అనంతరం నారా లోకేష్ బాబును రామవరప్పాడు టిడిపి నేత వర్ధినేని మురళీ నాయుడు మర్యాదపూర్వకంగా కలసి పార్టీ బలోపేతంపై కీలక సలహాలు, సూచనలు తీసుకున్నారు.
బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను ఎలా మరింత పటిష్టంగా నిర్వహించాలి, కేడర్‌ను ఎలా చురుకుగా ఉంచాలి అనే అంశాలపై లోకేష్ బాబు మార్గనిర్దేశం చేశారు. ప్రతి ఓటరుతో ప్రత్యక్ష సంబంధం పెంచుకోవడం, స్థానిక సమస్యలను వేగంగా గుర్తించి స్పందించడం ముఖ్యమని ఈ సందర్భంగా సూచించారు.ఈ వర్క్‌షాప్, భేటీ ద్వారా రామవరప్పాడు టీడీపీ నాయకులకు కొత్త ఉత్సాహం లభించి, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ప్రేరణగా నిలిచిందని మురళి నాయుడు తెలిపారు.

# శివయ్య బ్రహ్మోత్సవాల పేరుతో బాల్య వివాహాలు పోలీసులకు ఎమ్మార్పీఎస్ ఫిర్యాదు.



శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి ,07 :
బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని శ్రీకాళహస్తి పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పాలూరు వెంకట ముని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శ్రీకాళహస్తి మండలంలోని వేడం గ్రామానికి సమీపంలోని కొండచుట్టు రోడ్డులో ఉన్న అంజూరు మండపంలో వెలసిన శివ పార్వతి విగ్రహాల వద్ద ప్రతిరోజూ బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రత్యేకంగా త్వరలో జరగనున్న శివయ్య బ్రహ్మోత్సవాల సందర్భంగా శివయ్య కళ్యాణం రోజున భారీ సంఖ్యలో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా రామాపురం సమీపంలోని అంజూరు మండపంలో ఇలాంటి అక్రమ పెళ్లిళ్లు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు.ఈ నేపథ్యంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లకు ఎమ్మార్పీఎస్ తరఫున వినతిపత్రం అందజేశారు.దీనిపై స్పందించిన ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి వివాహాలు నిర్వహిస్తే తల్లిదండ్రులతో పాటు సహకరించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

# గంజాయి విక్రయుత అరెస్ట్.




తిరుపతి,పెన్ పవర్,ఫిబ్రవరి 7.
తిరుపతి రూరల్ మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తిని తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుండి 3. 5 కేజీల గంజాయి తో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు...... తిరుపతి రూరల్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఉప్పరపల్లి వాటర్ ట్యాంక్ వద్ద దాడి చేయగా ఓ వ్యక్తిని గుర్తించి పట్టుకోవడం జరిగిందన్నారు. అతడి వద్ద ఓ సంచిలో మూడున్నర కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు అలాగే అతడు ఉపయోగిస్తున్న హీరో మోటార్ సైకిల్ వాహనాన్ని,సెల్ ఫోన్ సీజ్ చేయడం జరిగింది అన్నారు. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన దుర్యోధన రెడ్డి తిరుపతిలో వాచ్మెన్ గా విధులు నిర్వహిస్తున్నారు ,ఒరిస్సాలో గంజాయి పండిస్తున్న వారి నుండి కొనుగోలు చేసి తిరుపతి ప్రాంతాలకు తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నట్లు నిందితుడు పోలీసుల ఎదుట ఒప్పుకోవడం జరిగిందన్నారు. అతడిపై క్రైమ్ నెంబర్,:51/2026 ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు నిందితుడిని తహసిల్దార్ వద్ద ప్రవేశపెట్టి అనంతరం కోర్టు ఎదుట హాజరు పరిచి రిమాండ్కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

# ఉపాధి హామీ పథకం పేరు మార్పు పేదలపై దాడే

## -పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి





శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి,07 :
తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం కోటపోలూరు గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ సంరక్షణ యాత్రలో పీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్పు చేయడం పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రగా అభివర్ణించారు.ఉపాధి హామీ పథకం నిరుపేదలకు సంజీవని వంటిదని, స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఈ పథకం పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచిందని గుర్తు చేశారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసిందని, నేటి ప్రభుత్వాలు మాత్రం పేదల నడ్డిని విరుస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఉపాధి కోసం నగరాలకు వలస వెళ్లకుండా నిలువరించడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వీబీగ్రామగ్ పథకం పేదలను మరింత పేదలుగా మార్చే ప్రమాదం ఉందని, వెంటనే కొత్త పథకాన్ని రద్దు చేసి పాత ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్తలు వెంకటాచలపతి, తలపా దామోదరం రెడ్డి, రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, జిల్లా, మండల, పట్టణ కాంగ్రెస్ నేతలు మరియు యువజన విభాగ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మిక హక్కులపై దాడి తట్టుకోం

## -: సార్వత్రిక సమ్మెకు శ్రీకాళహస్తిలో నినాదం.

శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి, 07 :
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమ్మె గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాసే విధంగా ఉండి కార్మికుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టుతున్నాయని విమర్శించారు. పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు సమ్మెలో కార్మికులంతా ఐక్యంగా పాల్గొనాలని ఆయన కోరారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, వీఓఏ, ఆర్పీ వంటి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం తీసుకురావాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్యతో పాటు గంధం మణి, వెంకటేష్, వేణు, రేవతి, గురునాధం, రాజా, అన్వర్ బాషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# శానిటైజేషన్ నుంచి వైద్యం వరకు పరిశీలన ప్రభుత్వాసుపత్రిలో బొజ్జల బృందమ్మ అకస్మిక తనిఖీ.

శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి ,07 :శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రిని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు సమయానికి చికిత్స అందుతోందా లేదా, మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలను ఆమె స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా శానిటైజేషన్ పరిస్థితులు, బాత్రూములు, వార్డులు, గదుల్లోని వైద్య పరికరాల పనితీరును ఆమె పరిశీలించి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులతో బృందమ్మ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చిన్న సమస్య ఉన్నా వెంటనే తెలియజేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు.రోగుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసిన ఆమె, డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇటువంటి అకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఆమె తెలిపారు.బొజ్జల బృందమ్మ ఆకస్మిక తనిఖీతో ఆసుపత్రి సిబ్బందిలో మరింత బాధ్యతతో పనిచేయాలనే ఉత్సాహం పెరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు





# శాంతిభద్రతలు కాపాడడానికే గోరీతోటలో ధైర్య-స్పర్శ

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 07,
శాంతిభద్రతలు కాపాడడానికే గోరీతోట లో ధైర్య-స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ డేగల ప్రభాకర్ అన్నారు.శనివారం ధైర్య-స్పర్శ భయానికి ముగింపు భద్రతకు ఆరంభం కార్యక్రమాన్ని పట్టణంలోని గోరీతోట నందు డిఎస్పి ఆధ్వర్యంలో ప్రారంభించారు. పట్టణంలోని గోరీతోట క్రైమ్ హాట్‌స్పాట్ ప్రాంతాన్ని పోలీసుల ఆధ్వర్యంలో సురక్షితంగా మార్చారు.జిల్లా ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా పలమనేరులోని గోరి తోటను క్రైమ్ హాట్‌స్పాట్‌గా గుర్తించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి,ప్రజలలో ఉన్న భయాన్ని తొలగించి భద్రతాభావాన్ని పెంపొందించేందుకు పలు చర్యలు చేపట్టారు.అలాగే డిఎస్పి డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలోగోరితోట ప్రాంతంలో ఉన్న పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి,అక్కడ దుర్ఘటనలకు,నేరాలకు అవకాశం ఉన్న అంశాలను తొలగిస్తూ పలు చర్యలు తీసుకున్నారు.ఈ ప్రాంతంలో ఉన్న పెద్ద పెద్ద పొదలు,చెట్ల ముసుగు తొలగింపు,
అలాగే అక్కడ పేరుకుపోయిన మద్యం వ్యర్థాలు,చెత్త తొలగింపు,ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు,రాత్రి వేళల్లో భద్రత పెంచేలా సరిపడా లైటింగ్ ఏర్పాటు, అనుమానాస్పద కార్యకలాపాలు అరికట్టేందుకు నిత్యం పోలీస్ పర్యవేక్షణ, పట్రోలింగ్ పెంపు ఇకపై నిర్వహించనున్నారు.
ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ..గోరితోట ప్రాంతాన్ని క్రైమ్ హాట్‌స్పాట్‌గా గుర్తించి, అక్కడ ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించి, సురక్షితవాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టామని దీని ద్వారా ఇకపై ఈప్రాంతంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్ శాఖ కఠిన చర్యలు




తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిఐ.మోహన్ రెడ్డి,ఎస్ఐ స్వర్ణతేజ,లోకేశ్వర్ రెడ్డి,పోలీసు సిబ్బంది, ఫారెస్ట్ అధికారులు మరియు సిబ్బంది, టీడీపీ నాయకులు ఆర్బీసీ కుట్టి మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు పారదర్శక సేవలే లక్ష్యం

**ఎఫ్ ఆర్ టి ఐ నేతలతో జిల్లా అధికారుల సమావేశం.**

తిరుపతి , పెన్ పవర్, ఫిబ్రవరి 07 :
ఎఫ్ ఆర్ టి ఐ (ఫోరం ఫర్ ఆర్ టి ఐ) జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్, జాతీయ అధ్యక్షులు మట్టా ప్రసాద్ సూచనల మేరకు జాతీయ సంయుక్త కార్యదర్శి కుప్పాల అజయ్ ప్రసన్న కుమార్ నేతృత్వంలో తిరుపతిలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా రెవిన్యూ ఆఫీసర్ కం జిల్లా అడిషనల్ మేజిస్ట్రేట్ జి. నరసింహులు, తిరుపతి అర్బన్ ఎం ఆర్ ఓ వి. సురేష్ బాబు, అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ జి. రామచంద్రతో ఫోరం ఫర్ ఆర్ టి ఐ నేతలు భేటీ అయ్యారు.
ఆర్ టి ఐ చట్టం ప్రకారం ప్రజలు కోరే సమాచారాన్ని నిర్దేశిత గడువులోపల అందించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. తమ శాఖల నుంచి వచ్చే సమాచార అభ్యర్థనలకు వేగంగా స్పందించి పారదర్శకంగా సేవలు అందిస్తామని వారు స్పష్టం చేశారు.తిరుమలతిరుపతి వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా ప్రజలకు సేవలు అందేలా చూడాలని ఎఫ్ ఆర్ టి ఐ నేతలు కోరారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో భాగంగా లోకాయుక్త, మానవ హక్కులు, సమాచార హక్కు చట్టాలపై అవగాహన కలిగించే క్యాలెండర్లను ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు అందజేశారు. నిజాయితీతో సేవలు అందిస్తున్న అధికారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు.ఎఫ్ ఆర్ టి ఐ ద్వారా వచ్చే సమాచార అభ్యర్థనలకు అన్ని కార్యాలయాల నుంచి సహకారం అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో పారదర్శక సేవలు అందేలా సిబ్బందికి దిశానిర్దేశం చేస్తామని తెలిపారు.
ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కరాటే డి సి ఎస్ రాయల్, రాష్ట్ర ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ ఎం. సుధాకర్ యాదవ్, జిల్లా మహిళా ఇంచార్జి అధ్యక్షురాలు వి. జయలక్ష్మీ, తిరుపతి నగర కమిటీ అధ్యక్షులు జి. వేణుగోపాల్‌తో పాటు పలువురు ఎఫ్ ఆర్ టి ఐ నేతలు పాల్గొన్నారు.

# 12వ తేదీన జరిగే సమ్మెకు సహకరించాలని కలెక్టర్ గారికి సిఐటియు వినతి.

తిరుపతి/పెన్ పవర్/ ఫిబ్రవరి 07
కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దుచేయాలని, కనీసవేతనం 26 వేలు ఇవ్వాలని, ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కోరుతూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ గారికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్ జయచంద్ర విజ్ఞప్తి చేయడం జరిగింది.
కేంద్ర బిజెపి ప్రభుత్వం దశాబ్దాలు పాటు కార్మికవర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు కాలరాస్తూ 29 కార్మిక చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ తెచ్చారని అన్నారు. లీవులు, పని గంటలు, ఓవర్ టైం, వారాంతపు సెలవులు, జాతీయ పండుగ సెలవులు, పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్య సౌకర్యాలు అమలు కాకుండా తాము అనుకున్నంత కాలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపివేసే అధికారం వుంది.ఇచ్చిన లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. కార్పొరేట్ ల ప్రయోజనాలు కొరకు మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమల్లోకి తెచ్చింది.
కార్మిక వర్గాన్ని మరింతగా దోచుకోవడానికి ఇప్పుడున్న కార్మిక చట్టాలు అడ్డుగా ఉన్నాయనేది వారి విధానం. కార్మికవర్గానికి ఇప్పుడున్న హక్కులను కూడా తొలగించడమే లేబర్ కోడ్ సారాంశం అని అన్నారు. కార్మిక వర్గాన్ని మరింత శ్రమ దోపిడీ చేసి ఆధునిక బానిసలుగా మార్చడానికి లేబర్ కోడ్లు తెచ్చారని అన్నారు.
కార్మిక చట్టాలు ఇప్పటికే అమలు కావడం లేదని, కనీస వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం 2007 నుండి ఇప్పటి వరకు పెంచలేదని, ఈ లోగా పుండు మీద కారం చల్లినట్లు కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. కార్పొరేట్ల, పెట్టుబడిదారుల సేవలో మోడీ ప్రభుత్వం తరిస్తున్నదని అన్నారు. ప్రజల డబ్బులు కోట్ల రూపాయలు లేబర్ కోడ్ గొప్పవని ప్రచారానికి యాడ్స్ కొరకు ఖర్చు పెడుతున్నారు.
గత చట్టాలు కంటే లేబర్ కోడ్స్ లో ఒక్కటి కూడా కార్మికులకు ఉపయోగపడే అంశం లేదని అన్నారు. స్కీం



వర్కర్లను కార్మికులుగా గుర్తించి చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు 125 రోజుల పని కాదు పని గ్యారంటీ పథకంగా ఉండాలి.
విద్యా, వైద్యా రంగాలకు కేంద్ర బడ్జెట్ లో 20%, జిడిపిలో 12% నిధులు కేటాయించాలని కోరారు. ప్రజాధనమైన ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటికరణ ఆపాలని డిమాండ్ చేశారు.
ఈ సమ్మెలో కార్మికులు విరిగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు

# నిరుద్యోగ యువతకు న్యాయం చేయండి

**- రాష్ట్రవ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఉద్యమ పిలుపు.**




శ్రీకాళహస్తి ,పెన్ పవర్, ఫిబ్రవరి ,07 :
నిరుద్యోగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర నేతలు విమర్శించారు. ఈ నెల 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఏఐవైఎఫ్ పిలుపునిచ్చిందిఈ మేరకు దాసరి నాగభూషణ భవనంలో జరిగిన రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. యుంగాధర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన ఉపాధి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, నిరుద్యోగ యువతను నిరాశలోకి నెట్టిందని ఆరోపించారు.ఈ నెల 12న జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై తక్షణమే చర్చ జరిపి ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అలాగే రాష్ట్రంలో మెడికల్ మాఫియా, డ్రగ్స్ మాఫియాలు నిర్భయంగా విస్తరిస్తున్నాయని, వీటికి ప్రభుత్వం పరోక్ష రక్షణ కల్పిస్తోందని వారు విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని తెలిపారు.ఫార్మసీ కౌన్సిల్‌లో జరిగిన అక్రమాలపై బాధ్యులైన అధికారులపై ఇప్పటివరకు చర్యలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ బాబి, ప్రభాకర్, గోవిందా రాజులు, సహాయ కార్యదర్శులు నాగ రాముడు, కత్తి రవి, సుబహాని తదితరులు పాల్గొన్నారు

# అనారోగ్య వైసీపీ కార్యకర్తకు అండగా నిలిచిన పార్టీ నాయకులు.



శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి 07:
ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ప్రస్తుతం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షేక్ షఫీని పార్టీ మైనారిటీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.అనంతరం షేక్ షఫీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తూ పార్టీ తరఫున అండగా ఉంటామని తెలిపారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చరవాణిలో షేక్ షఫీతో మాట్లాడి పరామర్శిస్తూ, కష్టకాలంలో పార్టీ ఎప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, గోరా, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, షేక్ జూమ్లేష్, షేక్ ఫజల్, షేక్ జీలాని బాషా, షేక్ గౌస్, గఫూర్, ఖాదర్ బాషా, షేక్ అస్లాం, ఫిరోజ్, షర్మిల ఠాగూర్, షేక్ బావాజీ తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ కలశాల యాజమాన్యం ప్రవీణ్ పై దుష్ప్రచారులు ఆపాలి.

**-దళిత విద్యార్థి సంఘాల జే ఏ సి.**



తిరుపతి, పెన్ పవర్, ఫిబ్రవరి 7.
పారామెడికల్ కళాశాలపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను ఆపాలని దళిత యువజన ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది.ప్రవీణ్ పారామెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న దిష్మాంజలి ఆత్మ హత్య చేసుకోవడం చాలా బాధాకరం వారి కుటుంబానికి దళిత విద్యార్థి యువజన ప్రజా సంఘాలు సంకీభావం వ్యక్తం చేశారు , ఈ సందర్భంగా దళిత విద్యార్థి యువజన ప్రజా సంఘాల జే ఏ సి కన్వీనర్ సుధాకర్ మాదిగ మాటలాడుతూ.... మా పరిశీలనలో ఆ విద్యార్థిని తనయొక్క వ్యక్తిగత కారణాలవలన బలవన్మరణం చేసుకోవడం జరిగిందని తాను సూసైడ్ నోట్ ద్వారా తెలియపరచడం జరిగింది. ఈ విషయంను పోలీస్ ఉన్నత అధికారులు పరిగణన లోకి తీసుకుని విచారణ చెప్పట్టాలని కోరారు, ఈ సంఘటన పై విద్యార్థిని తల్లి దండ్రుల ఫిర్యాదుతో ఈస్టు పోలీస్ స్టేషన్లో కళాశాల యాజమాన్యం పై కేసు నమోదైందిని తెలిసింది కళాశాల యాజమాన్యం నైతిక బాధ్యత తో విద్యార్థి కుటుంబానికి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు, కానీ కొన్ని రాజకీయ పక్షాలు కళాశాల యాజమాన్యం పై ప్రవీణ్ పై పలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. సత్వరం జిల్లా పోలీస్ సమగ్ర దర్యాప్తు చేసి న్యాయశీ చేయాలని కోరారు ఈ కార్యక్రంలో భారతీయ దళిత విద్యార్థి సేనా యుగంధర్ ,భారతీయ దళిత సేనా జెడి ప్రసాద్,మాల విద్యార్థి సంగం సుకుమార్,యూత్ కాంగ్రెస్ ప్రేమ్ సాగర్, ప్రభు, వాల్మీకి విద్యార్థి సంగం వినూత,అర్జున్, అశోక్, రవితేజ ,తదితరులు పాల్గొన్నారు

# రంగా రెడ్డి, జానకి రామిరెడ్డి కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్





గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,7:
చిల్లకూరు మండలం చిన్న కట్టువాపల్లి గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన దువ్వూరు రంగా రెడ్డి చిత్రపటానికి శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.
అదేవిధంగా చిల్లకూరు మండలం వరగలి గ్రామంలో స్వర్గస్తులైన గూడూరు ఏఎంసీ మాజీ ఛైర్మెన్ యరటపల్లి జానకి రామిరెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ




గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 7:
గూడూరు పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శనివారం కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కసుకుర్తి భారతి, కసుకుర్తి కోటేశ్వరరావు దంపతుల సంపూర్ణ సహకారంతో నిర్వహించారు.ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు నిరంతరం సహకారం అందిస్తున్న భారతి, కోటేశ్వరరావు దంపతులకు ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పేదల సేవే లక్ష్యంగా ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు అత్తి మంజరి గోపాల్, కన్వీనర్ రమేష్, సభ్యులు చవల సురేంద్ర, పేయ్యల రమణయ్య, ఎస్కే ముజీఫ్, సాయిరాం చారిటీ కార్యనిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువుల కొరత రానివ్వద్దు



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 07.
రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువుల కొరత రానివ్వద్దని సహాయ వ్యవసాయ సంచాలకులు సావిత్రి అధికారులకు సూచించారు.శనివారం పలమనేరు డివిజన్ పరిధిలోని ఏడుఏడు మండలాల వ్యవసాయాధికారులతోసమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ..ఈ సీజన్ నందు ఎరువులు డీలర్లు మరియు రైతుసేవాకేంద్రం నందు అందుబాటులో ఉన్నాయని తెలియజేస్తూ ఎరువుల అమ్మకాలపై వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,ఎఫ్.సి.ఓ 1985 విధిగా అమలుచేయాలని ఆదేశించారు.ఎమ్ఆర్పీ ధరలు మించకుండా ఎరువుల పంపిణీ జరగాలని,అనుమతి ఎరువుల అమ్మకాలను జరగకుండా చూసుకోవాలని,గ్రామాలలో అనుమతి లేని అమ్మకాలు చేపడితే కఠినచర్యలు ఎఫ్.సి.ఓ 1985,ఈసీఆక్ట్ 1986 మరియు క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని ఆమె అధికారులను హెచ్చరించారు.ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారిని సంధ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొత్తపల్లి వసంత్ కుమార్ నియామకం



గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,7:
ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు 7వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏ పి పి)గా గూడూరు పట్టణానికి చెందిన న్యాయవాది కొత్తపల్లి వసంత్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మూడేళ్ల కాలపరిమితితో బాధ్యతలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
గత 21 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న వసంత్ కుమార్, గతంలో గూడూరు సీనియర్ సబ్ కోర్టు ఏ పి పి గా రెండు పర్యాయాలు ప్రభుత్వం తరపున సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు సంపాదించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం తాజాగా 7వ అదనపు జిల్లా కోర్టు ఏపిపి గా అవకాశం కల్పించింది.ఈ సందర్భంగా గూడూరు బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు వసంత్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఏపిపి గా తన నియామకానికి సహాయ సహకారాలు అందించిన గూడూరు శాసన సభ్యులు పాసీం సునీల్ కుమార్‌కు వసంత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు



# ఉపాధి హామీ సంరక్షణ యాత్రలో పాల్గొన్న గూడూరు కాంగ్రెస్ నాయకులు

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,7:
సూళ్లూరుపేట నియోజకవర్గం కోట పోలూరు గ్రామం వద్ద నిర్వహించిన ఉపాధి హామీ సంరక్షణ యాత్రలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేరు మార్పు పేద ప్రజలకు నష్టం కలిగించే చర్య అని, మహాత్మా గాంధీ ఆశయాలకు విరుద్ధమని విమర్శించారు. నిరుపేదలకు సంజీవని వంటి ఈ పథకాన్ని స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల జీవితాలను మెరుగుపరచేందుకు అమలు చేశారని గుర్తు చేశారు.
డి సీ సీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ గ్రామీణ వలసలను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కీలకమని తెలిపారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త పథకం పేదలను మరింత పేదలను చేస్తోందని విమర్శిస్తూ, వెంటనే పాత పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు కాంగ్రెస్ నాయకులు పర్వతాల శ్రీనివాసులు గౌడ్, షేక్ నాయకుల ఫయాజ్, షేక్ రాజిక్, ఎండి గౌస్ బాషా, షేక్ రషీద్, షేక్ ఇబ్రహీం, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,7:
గూడూరు పట్టణంలోని 3వ,4వ వార్డుల పేదలకు స్థానికులు సాదుపేట సెంటర్ నందు ఏర్పాటు చేసిన దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు దుప్పట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అసహాయ కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందించిన పిపిఎస్

పలమనేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 07,
అసహాయ కుటుంభానికి పట్టణానికి చెందిన పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు ఆనంద బాబు, అధ్యక్ష,కార్యదర్శులు నరసింహులు, నారాయణ మాట్లాడుతూ.. పలమనేరు మండలంలోని సముద్రపల్లె పంచాయతీ ఎస్టీకాలనీ నందు నివసిస్తున్న వై. రామాంజులు(27)కు గత రెండు నెలలకు ముందు ఆక్సిడెంట్ జరిగింది. ఈ ఘటన వలన ఒక కాలు పూర్తి గా మోకాలు వరకు తీసివేయడం జరిగింది. ఇంకో కాలుకి రాడ్డులు బిగించడం జరిగింది. ప్రస్తుతం పూర్తిగా మంచానికే పరిమితంఈ సంఘటన జరిగిన తరువాత అతని భార్య ఆసుపత్రిలోనే వదిలిపెట్టి వెళ్ళిపోయింది. ఇతనికి తల్లి,తండ్రి,అన్న దమ్ములు ఎవరూ లేరు. అతనికిపిల్లలు పుట్టని కారణంగా ఆయన చెల్లెలు చనిపోవడంతో చెల్లలు కొడుకు గణేష్ అనే అబ్బాయిని ఈ వ్యక్తిని చూసుకొనే వాడు. ఆ అబ్బాయి 6వ తరగతి,ఇతనితో పాటు హేమావతి(12)అనే అమ్మాయి ఉంది. ఆ పాప అతని వదిన వాళ్ళ కూతురు,ఆ పాప 15 రోజులు వయసు ఉండగా ఆమె తల్లి చనిపోవడం జరిగింది. అప్పటి నుండి ఆ పాప కూడా ఇతని సంరక్షణలోనే ఉంది. ప్రస్తుతం ఈ అమ్మాయి 6వ తరగతి చదువుతుంది. ఈ ఇరువురు పిల్లలు ఇతన్ని చూసుకుంటున్నారు అతనిని చూసుకోవడానికి మూడు రోజులు ఆ అమ్మాయి పాఠశాలకు వెళితే మిగిలిన మూడు రోజులు ఆ అబ్బాయి పాఠశాలకు వెళుతున్నాడు. పక్కా ఇల్లు లేక,ఒక పాకలో ఉంటున్నారు. ఆ పిల్లలు అతనికి ఆహారం వండి పెట్టాల్సిన పరిస్థితి. కనీస నిత్యావసర వస్తువులు కూడా తెచ్చుకోలేని పరిస్థితి. అటువంటి కుటుంభయానికి పరిరక్షణ సమితి సభ్యులు నిత్యావసర వస్తువులు ఇవ్వడంతో భాదితులు సంతోషం వ్యక్తం చేసి పిపిఎస్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు





# వీ పి ఆర్ నేత్ర శిబిరానికి విశేష స్పందన ..

(పెన్ పవర్ ప్రతినిధి వింజమూరు ఫిబ్రవరి 7)
వింజమూరు మండలంలో పేద గ్రామీణ వాసులకు కంటి వెలుగులు ప్రసాదిస్తున్న విపిఆర్ నేత్ర వాహన వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తుంది. మండలంలో జరుగుతున్న వైద్య శిబిరాలలో భాగంగా శనివారం వింజమూరు పంచాయితీ పరిధిలోయర్రబల్లి పాలెంలో జరిగిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి సుమారు 430 పైచిలుకు కంటి రోగులు హాజరయ్యారు. వీరందరికీ ప్రత్యేక పరికరం ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన 190 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు యాదవులు మాట్లాడుతూ విపిఆర్ నేత్ర వాహన వైద్య శిబిరానికి ఎంతో స్పందన ఉందని మన నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదిస్తున్న వేమిరెడ్డి దంపతులు సదా చిరస్మరణీయులని పేర్కొన్నారు. పరోపకారార్ధం ఇదం శరీరం అన్న సూక్తి ప్రకారం వేమిరెడ్డి దంపతులు సేవ కోసమే కృషి చేస్తున్నారని వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో వారితోపాటు గణపం సుదర్శన్ రెడ్డి పట్టణ అధ్యక్షులు గురజాల గోపి పట్టణ ఉపాధ్యక్షులు మంచాల శ్రీనివాసులు నాయుడు సొసైటీ డైరెక్టర్ కోదూరు నాగిరెడ్డి నాయకులు దుదిగుంట శ్రీనివాసులు రెడ్డి గున్నం శ్రీనివాస్ రెడ్డి ఎన్నపల్లి పెంచలరావు చేజర్ల భాస్కర్ రెడ్డి బిజెపి మండల అధ్యక్షులు అంబటి ఈశ్వర్ రెడ్డి శ్రీనివాస నాయుడు ఇతర నాయకులు తదితరులు ఉన్నారు.

# దద్దాలను ఘనంగా సన్మానించిన గుంటుపల్లి పంచాయతీ పార్టీ నాయకులు

కనిగిరి, పెన్ పవర్ ప్రతినిధి
పీసీపల్లి మండలం గుంటుపల్లి పంచాయతీ పార్టీ నాయకులు,కార్యకర్తలు కనిగిరి స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ, పూల దండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీకి సంబందించిన గ్రామ కమిటీల నియామకాలపై ఆయన తో పలు విషయాలు చర్చించారు. అనంతరం అందరికీ న్యాయం చేస్తానని భరోసా కల్పించి, సమిష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి దద్దాల నారాయణ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంచనీ లక్ష్మిరెడ్డి,శేసం జేమ్స్ సర్పంచ్,గవిరెడ్డి కృష్ణారెడ్డి,సాన వెంకటేశ్వర్లు,శేషం నరేష్,కాకుటూరి పురుషోత్తం,ఇల్లూరి గురుస్వామి రెడ్డి,కాకర్ల మధు,మంచాల మాలకొండయ్య,మండే మాలకొండయ్య,హనుమంతు,మల్లికార్జున,బె బెజవాడ రవీంద్రబాబు తదితరులుపాల్గొన్నారు.

# బిజెపి పార్టీ బలోపేతం చేయడమే నా ధ్యేయం

**- బిజెపి నాయకులు మరియు దేశాయ్ నెట్వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్**

ఎమ్మిగనూరు: పెన్ పవర్ ప్రతినిధి
భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా జనతా వారిది జిల్లా కో కన్వీనర్ గా గురురాజ్ దేశాయ్ ఎన్నికైన సందర్భంగా వారికి బిజెపి నేతలు పూల మాలతో సన్మానించారు... ఈ సందర్భంగా గురురాజు దేశాయ్ స్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ జిల్లా పార్టీ నన్ను దృష్టిలో ఉంచుకొని ఇచ్చిన ఈ అవకాశాన్ని పదవిగా అలోచించకుండా ఒక బాధ్యతగా భావించి జిల్ల ప్రజలకు మరియు బిజెపి కార్యకర్తలకు సముచిత న్యాయం చేకూరుస్తానని అలాగే బిజెపి బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామ గ్రామనా మీ అందరి సహకారంతో బిజెపిని విస్తరింప చేస్తామని అన్నారు. ముక్యంగా జిల్లాలోని రైతుల సమస్యలు ప్రజలసమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వాటిని త్వరతగతిన పరిష్కరించడానికి బిజెపి తరపున కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు బి ఎల్ నారాయణ, ఎమ్మిగనూరు పట్టణం బిజెపి నాయకులు మాజి కౌన్సిలర్ శిల్పీ బాస్కర్, నందవరం మాజీ సర్పంచ్ ఎల్ఎల్సీ కాల్వ చైర్మన్ రామన్న గౌడ్, ఎమ్మిగనూరు మండల అధ్యక్షుడు కురువ బడేసాబ్, పట్టణ ఉపాధ్యక్షుడు గాజుల సురేంద్ర, కాశీరాం, ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు కల్లెలు శివ, మెకానిక్ శ్రీను,రజక సంఘం నాయకుడు హనుమన్న, తిమ్మాపురం పెద్దయ్య, సోషల్ మీడియా కన్వీనర్ దండు వీరేష్, డానియల్, అది ఆంధ్రా స్కూల్ చైర్మన్ శివ పాల్గొన్నారు.



# విద్యార్థుల వీడియోపై స్పందన

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7.
పవన్ సార్ మా ఊరికి రోడ్డు వేయించండి బురదలో స్కూలుకు వెళ్లకపోతున్నాం సార్ నెల్లూరు జిల్లా గజ్జెలవారిపల్లి విద్యార్థుల మీడియా స్పందించి రోడ్డును మంజూరు చేయించిన పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి వేగంగా నిర్ణయం తీసుకున్నారు. సోషల్ మీడియాలో తన దృష్టికి వచ్చే అంశాలపై సత్వరమే స్పందించే పవన్ కళ్యాణ్.. ఈ క్రమంలోనే విద్యార్థుల కష్టాలను చూసి వెంటనే ఓ ఊరికి రోడ్డును మంజూరు చేయించారు. నెల్లూరు జిల్లా గజ్జెలవారిపల్లెకు చెందిన కొంతమంది విద్యార్థులు తమ ఊరికి రోడ్డు వేయించాలంటూ పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. బురదలో నడవలేకపోతున్నాం పవన్ సార్ అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోపై స్పందించిన పవన్ కళ్యాణ్ వెంటనే ఆ ఊరికి రోడ్డు మంజూరు చేయించారు.


# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండండి

**- మేయర్ రూప్ కుమార్ యాదవ్**





నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7.
ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఇత్తెహాదుల్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోటమిట్ట కూడలి ప్రాంతంలో శనివారం "యువత మేలుకో" మహా అవగాహన సదస్సు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ రూప్ కుమార్ యాదవ్ హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండి ఉన్నతమైన, ఆదర్శవంతమైన జీవనాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. వివిధ విపత్కాల సమయంలో సంస్థ బృందం సమన్వయంతో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయం అని మేయర్ సంస్థ సభ్యులను ప్రశంసించారు.
ఇత్తెహాదుల్ సంస్థ ఆధ్వర్యంలో ఇంకొంతమంది ఔత్సాహిక యువతను సభ్యులుగా చేర్చుకొని సేవా కార్యక్రమాలను మరింత విస్తృతపరచాలని మేయర్ ఆకాంక్షించారు. సంస్థ సేవా కార్యక్రమాలకు మేయర్ గా తన తోడ్పాటును అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని మేయర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ కరీముల్లా, ప్రెసిడెంట్ ఖలీల్ అహ్మద్, కో క్లస్టర్ మైనుద్దీన్, సెక్రటరీరఫీ అహ్మద్,43వ డివిజన్ ప్రెసిడెంట్ జమీర్, వైస్ ప్రెసిడెంట్ హాఫీజుల్లా, సెక్రటరీ రబ్బానీ, మైనారిటీ పార్లమెంటరీ కార్యదర్శి కాలేషా, 43 వ డివిజన్ నాయకులు హాజీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇత్తెహాదుల్ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు




# ర సా భ సా గా వింజమూరు మండల సర్వసభ్య సమావేశం..

**-సభ్యుల మధ్య వాగ్వాదం.. గందరగోళం..-అదుపులోనికి తెచ్చిన ఎస్ ఐ వీర ప్రతాప్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి.. -క్యాస్టింగ్ ఓటుతో అభివృద్ధి పనులకు ఆమోదం..**

( వింజమూరు పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 7)
వింజమూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం ర సా భ స గా జరిగింది. ఎంపీపీ వనిపెంట హైమావతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యుల మధ్య వాగ్వివాదం, గందరగోళం ఏర్పడింది. ఎస్సై వీర ప్రతాప్, ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి సభను అదుపులోనికి తీసుకువచ్చారు. మండల అధికారులు తమ శాఖల గురించి వివరిస్తున్న సమయంలో, మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, గతంలో చేసిన పనులకు ఆమోదం తెలిపేందుకు ఒప్పుకునే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ సందర్భంలో ఎంపీటీసీ సభ్యులు పల్లాల కొండారెడ్డి, కలగజేసుకొని, తలుపులు వేసి, ఎంపీపీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకున్నారని, ఇప్పుడు కూడా మమ్ములను బయటకు పంపించి, తీర్మానాలు చేసుకోవాలని ఏకపక్ష నిర్ణయాలు జరుగుతున్నాయని ఆవేశంగా మాట్లాడారు. వెంటనే ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం మాకు లేదని, మేము ఎక్కడైనా తప్పులు చేసి ఉంటే ఉన్నతాధికారులకు, తెలియజేసుకోవచ్చు అన్నారు. అంతేకాకుండా కొన్ని చేసిన పనులపై కోర్టులకు కూడా వెళ్లారని, వాటికి కూడా మేము సమాధానం చెప్పామన్నారు. మేము చేసినవి సరైన నిర్ణయాలు అయినందున కొన్ని కేసులు కూడా కొట్టి వేయడం జరిగిందని తెలిపారు. గందరగోళం జరుగుతున్న నేపథ్యంలో బయట ఉన్న నాయకులు కొంతమంది లోపలికి రావడంతో వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంలో జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి వద్దనున్న మైకును లాగారు. మైకు ఎంపీడీవో ఇవ్వకపోవడం తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. సభలో ఉన్న సొసైటీ అధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ కలగజేసుకొని మైకు సభాధ్యక్షులు అనుమతితో తీసుకోవాలని, లాక్కోవడం సభ మర్యాద కాదని, మాట్లాడారు. వెంటనే పల్లాల కొండారెడ్డి, సభలో చర్చించకూడని అంశాలను లేవనెత్తడం, పరుష పదజాలంతో మాట్లాడడంతో ఉధృతి వాతావరణం ఏర్పడింది. ఒకరి పైకి ఒకరు ఆవేశంగా ఉరుకుతున్న సమయంలో ఎస్ ఐ వీర ప్రతాప్ అడ్డుగా నిలబడి, సర్ది చెప్పారు. వెంటనే ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి, బయట నుంచి వచ్చిన నాయకులను పంపించి వేశారు. ఆ తరువాత ఎంపీపీ క్యాస్టింగ్ ఓటుతో అభివృద్ధి పనులకు ఆమోదం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మండలంలో మొత్తం 12 మంది ఎంపీటీసీలు ఉండగా, 11 మంది హాజరయ్యారన్నారు. ఒక కో ఆప్షన్ సభ్యులతో కలిపి 12 మంది సభలో ఉన్నారన్నారు. వీరీలో ఆరు మంది సభ్యులు అభివృద్ధి పనులకు వ్యతిరేకంగా సభ నుండి వెళ్లిపోయారని తెలిపారు. మిగిలిన 6 మంది సభ్యులు ఆమోదం తెలిపారు అన్నారు. విరుపక్షాలు సమానం అయినందున, ఎంపీపీ వనిపెంట హైమావతి క్యాస్టింగ్ ఓటుతో అభివృద్ధి పనులకు ఆమోదం




తెలపడం జరిగిందన్నారు. ఎంపీపీ వనిపెంట హైమావతి మాట్లాడుతూ, మండల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారికి, ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచులకు, మండల అధికారులకు, పత్రికా ప్రతినిధులకు, ధన్యవాదాలు తెలియజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా, వింజమూరు మండలం, అభివృద్ధికి నోచుకోలేదని, మండల గ్రాంట్ అలాగే ఉందని, రెండు మూడు నెలల కాలంలోనే అభివృద్ధి చేసి చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బసిరెడ్డి సుమలత, పల్లా పురుషోత్తం, కాటం ప్రసన్న, మాజీ ఎంపీపీ ఇనగనూరి మోహన్ రెడ్డి, సాదం మౌనిక, యాకసిరి భవాని, ఉంటా శుభ రత్నమ్మ, మండల శాఖ అధికారులు, ఈవో పి ఆర్ డి రామారావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# హిందు ధర్మాన్ని భూజాన ఎత్తుకున్న టీడీపీ

**కర్నూలు ఫిబ్రవరి 8, పెన్ పవర్ :** భారతీయ జనతా పార్టీతో సుదీర్ఘకాలం ప్రయాణిస్తూ వస్తోంది తెలుగుదేశం పార్టీ. అయితే ఎన్నడూ హిందుత్వ వాదాన్ని తెలుగుదేశం పార్టీ తెర ముందుకు తేలేదు. చంద్రబాబు సైతం ఎన్నడు మాట్లాడిన దాఖలాలు లేవు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ కూడా హిందుత్వవాదంపై మొగ్గు చూపలేదు. కానీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని డిఫెన్స్ లో పడేయడానికి హిందూ ధర్మాన్ని భుజానికి ఎత్తుకున్నారు చంద్రబాబు. ఇది చంద్రబాబులో స్పష్టమైన మార్పు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇంకోవైపు తిరుమల ఏడుకొండల వాడి ప్రతిష్టను తగ్గించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నిందని కొత్త నినాదాన్ని అందుకున్నారు చంద్రబాబు. ఏపీలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా తిరుమల వెంకటేశ్వర స్వామికి కోట్లాదిమంది భక్తులు ఉన్నారు. ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరింత ఇబ్బంది కలిగించే విషయమే.అయితే ఏపీలో కూటమి ఐక్యత లేకుండా పోతేనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం దక్కుతుందని విజయసాయి రెడ్డి లాంటి వారు కూడా వ్యాఖ్యానించారు. కానీ ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అటాక్ చేయడం ప్రారంభించిందో.. ఆ మూడు పార్టీల మధ్య బంధం మరింతగా పెరిగింది. ఈ రెండేళ్లలో తొలిసారి కూటమి నేతలు ఒకే వేదిక పైకి వచ్చారు. తిరుమల లడ్డు వివాదాన్ని తెరపైకి తీసుకురావడం తమకు కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. కూటమి ఐక్యత ఒకవైపు.. హిందుత్వవాదం ఇంకోవైపు.. గోవిందుడి పైనే కుట్రగా అభివర్ణించడం ద్వారా ఓటు బ్యాంకు ఏకీకరణ మరోవైపు అన్నది వ్యూహంగా కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ కు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా వ్యవహరించారు చంద్రబాబుఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ కు తొలి సీఎంగా కూడా ఆయన వ్యవహరించారు. ఇప్పుడు రెండోసారి కూడా ఆయనే బాధ్యతలు చేపట్టారు. మరోవైపు తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రతిపక్ష నేతగా, జాతీయస్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాల సారధిగా కూడా వ్యవహరించారు. కానీ ఏ రోజు కూడా ఆయన హిందుత్వ వాదాన్ని తెరపైకి తేలేదు. జగన్మోహన్ రెడ్డి అవినీతి, వివేకానంద రెడ్డి హత్య వంటి అంశాలను ఎక్కువగా ప్రస్తావించేవారు. కానీ ఇప్పుడు తిరుమల వెంకన్న ప్రస్తావన తీసుకురావడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉన్నట్లు అర్థమవుతుంది. చూడాలి మరి ఇది ఎంతవరకు వర్కౌట్ అవుతుందో..



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అనంత, శ్రీ సత్యసాయి జిల్లాలకు మహర్దశ

**అనంతపురం, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** ఇటీవల కేంద్రం రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్లలో ఏపీకి కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కూడా ఖరీదైన ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ సర్వేతో పాటుగా పరిశోధనలు చేపట్టారు. అలాగే కడప జిల్లాలో కూడా ఖనిజాలు ఉన్నాయి.రాయలసీమను రతనాల సీమగా పిలుస్తారు.. అంతటి పేరు పొందిన ప్రాంతంలో ఇప్పటికి వజ్రాల వేట జరుగుతోంది. వర్షాకాలంలో పొలాల్లో వజ్రాలు బయటపడుతుంటాయి. అయితే రాయలసీమలో రత్నాల కంటే ఖరీదైన ఖనిజ సంపద ఉందని తెలుస్తోంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు స్థానం దక్కింది. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ చేయనున్నట్లు తెలుస్తోంది.అనంతపురం జిల్లాలో 2023లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పలు ప్రాంతాల్లో కొన్ని ఖనిజాలు (నియోబియం, నియోడైమియం, సిరియం, లాంథనం, ప్రాసోడైమియం,స్కాండియం, జిర్కోనియం, లిథియం) ఉన్నట్లు గుర్తించారట. ఈ ఖనిజాలను ఎయిర్‌క్రాఫ్ట్, స్మార్ట్‌ఫోన్లు, విండ్ టర్బైన్స్, కంప్యూటర్లు వంటి వాటిలో కూడా ఉపయోగిస్తారని చెబుతున్నారు. లిథియం చాలా అరుదుగా దొరికే నిక్షేపాలలో ఒకటి.. తాడిమర్రి, తురకవారిపల్లి, దాడితోట ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారట. అనంతపురం జిల్లాతోపాటుగా కడప జిల్లాలో (పార్నపల్లె, లోపటనూతల) కూడా పరిశోధనలు చేయగా.. అక్కడ కూడా లిథియంను గుర్తించారట.ఈ లిథియంను ఎక్కువగా బ్యాటరీలలో వినియోగిస్తారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలతో పాటుగా డిజిటల్ కెమెరాలు, మొబైల్స్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ ఖనిజాల కోసం చేస్తున్నారు. ఏఎండీ, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశోధనలతో పాటుగా హెలికాప్టర్ సర్వే కూడా చేపట్టారు.కేంద్రం ఇటీవల రేర్ ఎర్త్ కారిడార్లకు సహకారం అందిస్తామని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి. సముద్ర తీరంలో బీచ్‌శాండ్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా అరుదైన ఖనిజాలు ఉన్నట్లు తేలింది. గతంలో విశాఖపట్నంతో పాటుగా తూర్పుగోదావరి జిల్లాల్లో పరిధిలో బాక్సైట్ నిల్వలు గుర్తించిన సంగతి తెలిసిందే. చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో బంగారం ఖనిజాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. వాటితో పాటుగా పైన తెలిపిన ఖనిజాలను కూడా గుర్తించారు. వీటి తవ్వకాలకు ముందుకొచ్చేవారికి కేంద్రం నుంచి ప్రోత్సాహం అందిస్తారు.

## తిరుపతిలో స్పేస్ సిటీ

**తిరుపతి, ఫిబ్రవరి 8, పెన్ పవర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానుంది. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ వద్ద 2800 ఎకరాలలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. అయితే స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడత ప్రారంభానికి రంగం సిద్ధమైంది. మరో రెండు నెలల్లో తొలివిడతను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. తొలి విడతలో 570 ఎకరాలలో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. ఈ ప్రాజెక్టుతో తిరుపతి జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెప్తున్నారు,.ఏపీలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ప్రారంభానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడతను త్వరలోనే ఏపీ ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిసింది. తిరుపతిలో 2800 ఎకరాలలో స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. మరో రెండు నెలలలో ఈ ప్రాజెక్టు తొలి విడతను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రీసెర్చ్, శాటిలైట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్ టెక్నాలజీ హబ్‌గా ఈ స్పేస్ సిటీని తీర్చిదిద్దాలని ప్రణాళికలు రచిస్తున్నారు.తిరుపతి జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ ప్రాంతంలో ఈ మెగా స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. స్పేస్ సిటీ ప్రాజెక్టు మొదటి దశలో 570 ఎకరాలలో 140 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. మిగతా భూమిని రెసిడెన్సియల్ జోన్లు, ఇన్స్టిట్యూషనల్ క్యాంపస్, లాజిస్టిక్ పార్కులు, అంతర్గత రహదారుల అభివృద్ధి , హైస్పీడ్ ఇంటర్నెట్, కరెంట్, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగిస్తారు.మరోవైపు స్పేస్ సిటీలో ఉపగ్రహాల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్ యూనిట్లు, టెస్టింగ్,క్యాలిబరేషన్ ల్యాబులు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్లు వంటివి ఏర్పాటు చేయనున్నాయి. అలాగే స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ హబ్స్, డేటా అనలిటిక్స్, డిఫెన్స్ అప్లికేషన్స్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ వంటివి అందుబాటులో ఉండనున్నాయి. మరోవైపు స్పేస్ సిటీ నిర్మాణం కోసం ఈ ప్రాంతాన్ని కూడా వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. సమీపంలోనే సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట ఉండటం, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరలో ఉండటం, జాతీయ రహదారులు, పోర్టులకు సమీపంలో ఉండటం కూడా కలిసి వస్తోంది.ఈ స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజులలో స్పేస్ సిటీ ద్వారా 25 వేలకోట్ల రూపాయల పెట్టుబడులను స్పేస్ రంగంలో రాబట్టాలని ప్రణాళికలు రచిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు చెప్తున్నారు.స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ఇంజనీర్లు, సైంటిస్టులు, టెక్నీషియన్లు, డేటా స్పెషలిస్టులు, మిగతా అనుబంధ రంగాల వారికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్తున్నారు. మరోవైపు స్పేస్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక సర్వేలు, పర్యావరణ అంచనాలు, స్థానికులతో చర్చలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలలో స్పేస్ సిటీ తొలివిడత ప్రారంభిస్తారని సమాచారం.

## కేడర్ లో కనిపించని జోష్

## దాడులు జరిగిన చోటే కనపిస్తారా

**విజయవాడ, గుంటూరు, ఫిబ్రవరి 8,పెన్ పవర్ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కేవలం పరామర్శలకు మాత్రమే పరిమితమవుతున్నారు. ఇప్పటికే రెండేళ్ల కాలం పూర్తయింది. దీంతో పరామర్శలు ఆపేసి పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. వైసీపీ గత ఎన్నికల్లో కేవలం పదకొండు నియోజకవర్గాల్లోనే గెలిచింది. మిగిలిన 164 నియోజకవర్గాల్లో పార్టీ ఆశించినంత మాత్రం బాగా లేదు. అక్కడ క్యాడర్ కు, నేతలకు మధ్య గ్యాప్ పెరిగింది. రెండేళ్లవుతున్నా నేతలు కొందరు కార్యకర్తలను దగ్గరకు తీసుకోవడం లేదు. దీంతో జగన్ జిల్లాల పర్యటన చేయాలంటున్నారు. పాదయాత్ర సంగతి తర్వాత.. అది ఏడాదిన్నర తర్వాత కాని మొదలు కాదు. కానీ ఈలోపు పార్టీలోని క్యాడర్ ను, లీడర్ ను యాక్టివ్ చేయాలంటే ఖచ్చితంగా జిల్లాలకు వెళ్లి నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేయాలని నేతలు కోరుతున్నారు.ఇప్పటికీ రాయలసీమలోని ఒకటి రెండు జిల్లాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పార్టీ యాక్టివ్ గా లేదు. జగన్ బయటకు వచ్చినప్పుడు మాత్రం కార్యకర్తలు అభిమానంతో వచ్చి జగన్ కు స్వాగతం చెబుతున్నారు. జగన్ ను చూసేందుకు పోటీ పడుతున్నారు. కానీ చాలా నియోజకవర్గాల్లో పరిస్థితి మాత్రం ఇంకా మెరుగుపడలేదన్నది చాలా మంది బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ పదవులను పూర్తిగా చేపట్టలేదు. బూత్ లెవెల్ కమిటీల నియామకం చాలా చోట్ల జరగకపోవడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. పాత నేతలే తిరిగి పోటీ చేస్తారన్న భావనతో కొత్త వారు నియోజకవర్గంలో నాయకత్వ బాధ్యతలను చేపట్టేందుకు ముందుకు రావడం లేదని గట్టిగా పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.ద్వితీయ శ్రేణి నేతలు కొంత గట్టిగానే ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతలు మాత్రం అప్పుడే ఎందుకన్నట్లు కొంత ఇంకా ఆలోచనలో ఉన్నారు. జగన్ పాదయాత్ర సమయానికి బయటకు వచ్చి యాక్టివ్ అయితే బాగుంటుందని వారి వ్యాపారాలు, మిగిలిన వ్యక్తిగత వ్యవహారాల్లో మునిగిపోయారు. 175 నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల్లో గెలిచిన 151 మందిలో పది నుంచి పదిహేను మందికి మించి యాక్టివ్ గా లేరు. ఇది నిజం. పరామర్శ చేయవచ్చు. తప్పులేదు. కానీ అదే సమయంలో జగన్ జిల్లాలకు వచ్చి కార్యకర్తలతో ముఖాముఖి సమావేశాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది.

# కాపు కాస్తామంటున్న వైసీపీ

# సామాజిక లెక్కల్లో జగన్ టీమ్



**గుంటూరు, ఫిబ్రవరి 8 పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త రాజకీయ దారులను వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఆలోచనలు సాధారణ విశ్లేషణలకు భిన్నంగా ఉంటాయని, ఓటమి తర్వాత మరింత జాగ్రత్తగా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారని అనుచరులు అంటున్నారు. రాజకీయాల్లో ఓడిన చోటే తిరిగి బలం పెంచుకోవడం ఒక సంప్రదాయం. జగన్ కూడా అదే మార్గాన్ని ఎంచుకుని, పాత పద్ధతులకు బదులుగా కొత్త వ్యూహాలపై నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ ఓటమికి కారణమైన రాజకీయ, సామాజిక పరిణామాలను ఆయన లోతుగా అధ్యయనం చేస్తున్నారని ఇటీవల ఆయన ప్రసంగాలు సూచిస్తున్నాయి.ఈ వ్యూహాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు) పాత్ర కీలకంగా మారుతోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు మూడున్నర దశాబ్దాలు పట్టింది. వైఎస్సార్ అనుచరుడిగా కాంగ్రెస్‌లో పనిచేసినా, ఉమ్మడి ఏపీలో ఎమ్మెల్యేగా గెలవలేకపోవడం ఆయన రాజకీయ ప్రయాణాన్ని నెమ్మదింపజేసింది. అయితే వైసీపీ ఏర్పడ్డాక జగన్ ఆయనకు ప్రాధాన్యత ఇచ్చారు. 2022లో మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా, తాజాగా కాపులలో “టైగర్” అంటూ బిరుదు ఇచ్చి ముందుకు తెచ్చారు.జగన్ రాజకీయ లెక్కల్లో కాపు సామాజిక వర్గం ముఖ్యంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపులో వారి మద్దతు కీలకంగా నిలిచింది. అప్పట్లో ముద్రగడ పద్మనాభం (ఉద్యమం కూడా కలిసివచ్చి, గోదావరి జిల్లాలు ( వైసీపీకి బలంగా మారాయి. కానీ 2024 నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పవన్ కళ్యాణ్ రూపంలో కాపులకు బలమైన నాయకుడు రావడం, ఆయన చంద్రబాబు నాయుడు తో జట్టు కట్టడం వల్ల రాజకీయ సమీకరణలు తారుమారు అయ్యాయి. ఈ మార్పుతో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది.ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు ఘటనను జగన్ వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అంబటి కుమార్తె మౌనిక మీడియాతో మాట్లాడుతూ తమపై అధికార దుర్వినియోగం జరుగుతోందని ప్రశ్నించడం కాపు వర్గాల్లో చర్చకు దారి తీసింది. జనసేన మద్దతుతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ) తమపైనే బలప్రయోగం చేస్తుందా అనే సందేహాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇది నేరుగా రాజకీయ నేతలకు కాకపోయినా, కాపు సమాజంలో భావోద్వేగాలను రేకెత్తించడానికే అన్న విశ్లేషణ ఉంది.గుంటూరు జిల్లా లో జగన్ పర్యటన సమయంలో కాపు జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్పందన కనిపించిందని అంటున్నారు. అంబటి రాంబాబు భవిష్యత్తులో తన సామాజిక వర్గాన్ని ఎంతవరకు పోలరైజ్ చేయగలుగుతారన్నది కీలక ప్రశ్నగా మారింది. వంగవీటి రంగా అనుచరుడిగా గతంలో కాపునాడు కార్యక్రమాల్లో పనిచేసిన నేపథ్యం ఆయనకు ఉంది. ఇప్పుడు వైసీపీ ఆయనను ముందుకు తెస్తూ కొత్త గుర్తింపునివ్వాలని చూస్తోంది. అంబటి విడుదల తర్వాత ఆయనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆలోచన కూడా పార్టీ వర్గాల్లో ఉంది. కూటమి వర్సెస్ అంబటి అంశం రాబోయే రోజుల్లో మరింత వేడెక్కే అవకాశముంది. ఈ మొత్తం వ్యవహారంలో జగన్ వేసిన అడుగు వ్యూహాత్మకమా కాదా అన్నది రాజకీయ ఫలితాలే తేల్చాలి.

**అంబాసిడర్ స్థాయికి అంబటి**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రమోషన్ పొందాలన్నా.. పదవులు దక్కించుకోవాలని అనుకున్నా ప్రత్యర్థి పార్టీల నాయకుల మీద బూతులతో విరుచుకుపడాలి. ఆయా పార్టీల నేతల ఇళ్లపై కర్రలతో దాడులకు దిగాలి. లేకుంటే నిత్యం జగన్మోహన్ రెడ్డికి వీర విధేయుడుగా ఉంటూ ఆయన నామస్మరణ చేయాలి. ఆయన అడుగులకు మడుగులు వత్తాలి. అప్పుడే వారికి పదవులు లభిస్తాయి. పిలిచి మరి పదవులు కట్టబెడతారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల హయాంలో జరిగింది కూడా అదే.ఏదైనా మంత్రి పదవి నిర్వర్తిస్తే వారి శాఖలో ప్రగతి చూస్తారు. కానీ వైసీపీ హయాంలో శాఖల ప్రగతి కంటే ప్రత్యర్థులపై బూతులతో విరుచుకుపడే మంత్రులే అధికం. కొడాలి నాని కి తొలి మూడేళ్లు పదవి ఇచ్చారు జగన్. చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడనిదే పొద్దు గడవదు అన్నట్టు ఉండేది కొడాలి నాని పరిస్థితి. ఆ స్థాయిలో జగన్మోహన్ రెడ్డిని మెప్పించారు కనుక కొడాలి నానికి మంత్రి పదవి దక్కింది. ఏకంగా పౌరసరఫరాల శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. అంతెందుకు జోగి రమేష్ విషయంలో కూడా అదే జరిగింది. ఆయన చంద్రబాబు ఇంటి మీదకు కర్రలతో దాడికి తెగబడినందుకే జోగి రమేష్ కు ఏకంగా గృహ నిర్మాణ శాఖ మంత్రిగా క్యాబినెట్ లో చోటు కల్పించారు జగన్మోహన్ రెడ్డి.సొంత సామాజిక వర్గాన్ని జగన్ కోసం కించపరిచారు పేర్ని నాని ఇక అంబటి రాంబాబు గురించి చెప్పనవసరం లేదు. అప్పటికీ ఇప్పటికీ ఆయన నోరు అదుపులోకి రావడం లేదు. పోసాని కృష్ణ మురళి అయితే పవన్ కళ్యాణ్ తో పాటు ఆయన కుటుంబాన్ని నీచాతి నీచంగా దూషించారు. ఏకంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. ఇక రోజా గురించి చెప్పనవసరం లేదు. రోజా గురించి చెప్పనవసరం లేదు. బూతు సైగలతో,, చిల్లర మాటలతో ప్రత్యర్థులను రెచ్చగొట్టేవారు. రెచ్చిపోయేవారు. అందుకు ఆమె పర్యాటక శాఖ మంత్రి పదవి పొందారు. ఇలా జగన్ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ హద్దులు చెరిపేసి దిగజారి ప్రవర్తించిన ప్రతి ఒక్కరికి పదవులు దక్కాయి. ఇప్పుడు అంబటి రాంబాబుకు ఏ స్థాయిలో ప్రమోషన్ దక్కుతుందో చూడాలి.

# అఫెన్స్ మూడ్ లోకి కల్తీ నెయ్యి...

**విజయవాడ, ఫిబ్రవరి 8, పెన్ పవర్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా ప్రకంపనలు సృష్టిస్తున్న కల్తీ నెయ్యి వ్యవహారం, అనూహ్యంగా అధికార కూటమి పార్టీల మధ్య సరికొత్త ఐక్యతకు పునాది వేసింది. విపక్షాల విమర్శలు, సాంకేతిక అంశాల నడుమ కొంత డిఫెన్స్ ధోరణిలో ఉన్నట్లు కనిపించిన టీడీపీ, జనసేన, బీజేపీలు ఇప్పుడు ఎదురుదాడికి సిద్ధమయ్యాయి. తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఆధ్యాత్మిక భావోద్వేగ అంశంగానే కాకుండా, రాజకీయ అస్తిత్వ పోరాటంగా మారింది. ఆరంభంలో ఈ విషయంలో కొంత తడబడినట్లు కనిపించిన అధికార కూటమి, ఇప్పుడు పూర్తిస్థాయి అప్రమత్తతతో విపక్షాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది.కల్తీ నెయ్యి అంశంలో సిట్ విచారణ, సుప్రీంకోర్టు వ్యాఖ్యలు, సీబీఐ ప్రమేయం వంటి అంశాలను అస్త్రాలుగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్లు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలని కూటమి నిర్ణయించింది. కేవలం ప్రభుత్వపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా గట్టి సమాధానం ఇవ్వకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని గ్రహించిన కూటమి నేతలు, గురువారం ఉమ్మడిగా మీడియా ముందుకు రావడం ఒక కీలక మలుపు.వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మూడు పార్టీల ప్రతినిధులతో కూడిన ఒక అంతర్గత సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన భాగం. క్షేత్రస్థాయిలో ప్రజలకు కల్తీ జరిగిన తీరును, గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెండర్ల ప్రక్రియను వివరించాలని నిర్ణయించాయి. సిట్ విచారణలో వెల్లడవుతున్న కీలక అంశాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకురావాలని, సోషల్ మీడియాలో విపక్షాలు చేస్తున్న నెగటివ్ ప్రచారాన్ని మూడు పార్టీల ఐటీ విభాగాలు సమన్వయంతో తిప్పికొట్టాలని తీర్మానించాయి.ఈ అంశంలో పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష హిందూ ధర్మ పరిరక్షణ కోణంలో ప్రజల్లోకి బలంగా వెళ్లింది. దీనికి బీజేపీ జాతీయ స్థాయి మద్దతు కూడా తోడవడంతో, కూటమి మధ్య సైద్ధాంతిక సారూప్యత మరింత పెరిగింది. చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ భావోద్వేగ సందేశం, బీజేపీ జాతీయ అండదండలు కలగలిసి వైసీపీని రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.సాధారణంగా కూటమి ప్రభుత్వాల్లో పార్టీల మధ్య చిన్నపాటి భేదాభిప్రాయాలు సహజం. కానీ, ఈ నెయ్యి కల్తీ వ్యవహారం ఆ గ్యాప్‌ను పూడ్చేందుకు ఉపయోగపడింది. విచారణ సంస్థల క్లీన్ చిట్ రాకముందే వైసీపీ హడావుడి చేస్తోందని, దీన్ని ఎదుర్కోవడంలో డైలమా వీడిపోయిందని స్పష్టమవుతోంది. ప్రభుత్వ గొంతు కంటే కూటమి గొంతు బలంగా వినిపిస్తేనే ఫలితం ఉంటుందని గుర్తించడం కూటమి పరిణతికి నిదర్శనం.మొత్తానికి, వైసీపీ విసిరిన సవాల్‌ను కూటమి పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఈ ఉమ్మడి పోరాటం కేవలం కల్తీ నెయ్యి అంశానికే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ఇతర పాలనాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి కూడా ఒక నమూనాగా మారే అవకాశం ఉంది. సమన్వయం మెరుగుపడడం వల్ల ఏపీ రాజకీయాల్లో కూటమి మరింత బలోపేతం కానుంది.ఢిల్లీలోని అరిస్టో కెమికల్స్ నుంచి భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు దాదాపు 8,900 కిలోల లాక్టిక్ యాసిడ్, లబ్సాను కొనుగోలు చేసినట్లు ఆధారాలు దొరికాయి. పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్ వంటి చౌకరకం నూనెలకు ఈ రసాయనాలను కలిపితే, అవి అచ్చం నెయ్యికి ఉండే రంగు, రుచి, వాసనను సంతరించుకుంటాయి. ల్యాబ్ పరీక్షల్లో కూడా ఇది నెయ్యి అని నమ్మించేలా చేసేందుకు బీటా-కెరోటిన్ , ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్ వంటి మిశ్రమాలను కూడా జోడించారు. దాదాపు 57.56 లక్షల కిలోల నూనెను ఇలా రసాయనాలతో కల్తీ చేసి తితిదేకు (తిరుమల తిరుపతి దేవస్థానం) నెయ్యి పేరుతో అంటగట్టారు ఆహార భద్రతా చట్టం ప్రకారం పాలు, నెయ్యి వంటి ఉత్పత్తుల్లో లబ్సా వాడటం పూర్తిగా నిషేధం. ఈ రసాయనం కలిసిన పదార్థాలను తీసుకుంటే జీర్ణాశయం దెబ్బతినడం, పేగులకు గాయాల వ్వడం, కాలేయ వ్యాధులు తలెత్తుతాయి.

# ఛీ.. తూ.. ఇదీ ఒక గెలుపేనా..

## పాకిస్తాన్ జట్టును పొట్టుపొట్టు తిడుతున్న ఫ్యాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** గెలిచినా తిడతారు.. ఓడినా తిడతారు.. ఆడినా తిడతారు.. ఆడకపోయినా తిడతారు.. పాకిస్తాన్ జట్టు దుస్థితి ఇలా ఉంది. టీ 20 వరల్డ్ కప్ ఫస్ట్ డే.. గ్రూప్ ఏలో ఉన్న పాక్ జట్టు.. ఫస్ట్ మ్యాచ్ గా నెదర్లాండ్స్ టీంపై ఆడింది. పాకిస్తాన్ గెలిచింది. గెలిస్తే సంబరాలు చేసుకోవాలి కదా.. మరి తిడతారు ఏంటీ అంటారు.. అక్కడికే వస్తున్నాం.. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు 20 ఓవర్లలో 147 పరుగులు చేసింది. ఆ తర్వాత 148 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగింది పాకిస్తాన్. నెదర్లాండ్స్ జట్టు.. పిల్ల బచ్చా టీం.. క్రికెట్‌లో పిల్లకూన జట్టు.. పాకిస్తాన్ ఏమో పెద్ద పులి లెక్క ఫీలయ్యారు పాక్ ఫ్యాన్స్.. గ్రౌండ్‌లో సీన్ రివర్స్ అయ్యింది.. పాకిస్తాన్ జట్టు.. 148 పరుగుల టార్గెట్ ఛేజ్ చేయటానికి ఏకంగా 20 ఓవర్ల 3 బంతులు తీసుకుంది. అంటే జస్ట్ మూడు బంతులు మిగిలి ఉండగా.. టార్గెట్ ఛేజ్ చేసి గెలిచింది. ఇక్కడే పాకిస్తాన్ జనం.. పాక్ క్రికెట్ అభిమానులు రగిలిపోయారు..పిల్లకూన నెదర్లాండ్స్ .. 148 పరుగుల టార్గెట్ ఛేజ్ చేయటానికి 19 ఓవర్లు తీసుకోవటం ఏంటీ.. అంటే చచ్చీచెడీ.. కష్టపడి గెలవటం ఏంటీ... నెదర్లాండ్స్ బౌలర్లు అంతలా పాక్ జట్టును వణికించారా.. ఇలా అయితే మిగతా జట్లతో ఇంకేం ఆడతారు.. అంటూ తిట్టిపోస్తున్నారు పాకిస్తాన్ జనం.. ఫ్యాన్స్.. 2026లో పాకిస్తాన్ జట్టు బోణీ కొట్టింది. నెదర్లాండ్స్‌శ్రీపై 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పాక్.. నెదర్లాండ్స్ జట్టును 19.5 ఓవర్లలో 147 పరుగులకు కట్టడి చేసింది. నెదర్లాండ్స్ జట్టు ఏడు వికెట్లు నష్టపోయి పాక్ ముందు 148 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. పాకిస్తాన్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 19.3 ఓవర్లకే 148 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

పాక్ బ్యాటర్లలో ఫర్హాన్ 47 పరుగులతో రాణించాడు. ఫహీమ్ అష్రఫ్ 29 (నాటౌట్), అయూబ్ 24, బాబర్ అజమ్ 15, సల్మాన్ అఘా 12, మహ్మద్ నవాజ్ 6, షాహిద్ అఫ్రీదీ 5 (నాటౌట్)గా నిలిచారు. నెదర్లాండ్స్ బ్యాటర్లలో స్కాట్ ఎడ్వర్డ్ 37, బాస్ డి లీడే 30, మైకేల్ లెవిట్ 24, ఆర్యన్ దత్ 13 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో సల్మాన్ మీర్జాకు 3 వికెట్లు, మహ్మద్ నవాజ్ 2, అబ్రార్ అహ్మద్ 2, అయూబ్ 2, అఫ్రీదీకి ఒక వికెట్ దక్కింది. నెదర్లాండ్స్ బౌలర్లలో ఆర్యన్ దత్ 2, పాల్ వాన్ మికరెన్‌శ్రీకు 2, వాన్ బీక్, కైల్ క్లైన్, రోలోఫ్ వాన్ డెర మెర్వేకు తలో వికెట్ దక్కింది.

# టీ20 వరల్డ్ కప్: రాణించిన హెట్మెయర్... విండీస్ 20 ఓవర్లలో 182-5

**టీ20 వరల్డ్ కప్ లో వెస్టిండీస్ వర్సెస్ స్కాట్లాండ్**

**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న స్కాట్లాండ్**

**20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసిన వెస్టిండీస్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా స్కాట్లాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు భారీ స్కోరు సాధించింది. మిడిలార్డర్ బ్యాటర్ షిమ్రోన్ హెట్మెయర్ (64) హాఫ్ సెంచరీతో చెలరేగడంతో, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఫలితంగా స్కాట్లాండ్ ముందు 183 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన స్కాట్లాండ్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (35), షాయ్ హోప్ (19) ఓ మోస్తరు ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, ఆ తర్వాత షిమ్రోన్ హెట్మెయర్ స్కాట్లాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 36 బంతుల్లో 2 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతనికి రోవ్‌మన్ పావెల్ (24), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (26) కూడా వేగంగా ఆడి తమ వంతు సహకారం అందించారు.స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ కర్రీ అద్భుతంగా బౌలింగ్ చేసి, 4 ఓవర్లలో కేవలం 23 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. సఫ్యాన్ షరీఫ్, మైఖేల్ లీస్క్, డేవిడ్‌సన్ తలో వికెట్ తీశారు.అనంతరం 183 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. తాజా సమాచారం అందేసరికి స్కాట్లాండ్ 2.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 19 పరుగులతో ఆడుతోంది. జేసన్ హోల్డర్ బౌలింగ్‌లో మైఖేల్ జోన్స్ (1) ఔటయ్యాడు.

# రంగంలోకి శ్రీలంక.. భారత్‌తో మ్యాచ్‌పై పునరాలోచనలో పాకిస్థాన్?




**భారత్‌తో మ్యాచ్ బాయ్‌కాట్‌పై పునరాలోచించాలని పాక్‌ను కోరిన శ్రీలంక**

**మ్యాచ్ జరగకపోతే తీవ్ర ఆర్థిక నష్టాలు తప్పవన్న శ్రీలంక క్రికెట్ బోర్డు**

**శ్రీలంక అభ్యర్థనపై తమ ప్రభుత్వంతో మరోసారి సంప్రదిస్తామన్న పీసీబీ**

**సోమవారం నాటికి ఈ అంశంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం**

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలన్న నిర్ణయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పునరాలోచనలో పడింది. ఈ మ్యాచ్‌ను నిర్వహించకపోతే తీవ్రంగా నష్టపోతామని టోర్నీ సహ ఆతిథ్య దేశమైన శ్రీలంక విజ్ఞప్తి చేయడంతో... పీసీబీ ఈ అంశాన్ని మరోసారి తమ ప్రభుత్వంతో సంప్రదించాలని భావిస్తోంది.ఈ నెల 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించొద్దని కోరుతూ శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) పీసీబీకి ఒక ఈమెయిల్ పంపింది. ఈ కీలక మ్యాచ్ రద్దయితే తమ బోర్డుకు గేట్ మనీ, హాస్పిటాలిటీ అమ్మకాల రూపంలో భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ఎస్ఎల్‌సీ అధ్యక్షుడు షమ్మీ సిల్వా.. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీకి నేరుగా వివరించారు. అంతేకాకుండా ఇది శ్రీలంకలో టోర్నమెంట్ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీలంకతో పాకిస్థాన్‌కు ఉన్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా వారి అభ్యర్థనను తేలిగ్గా తీసుకోలేమని పీసీబీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలో లేని మొహ్సిన్ నఖ్వీ, తిరిగి వచ్చాక ఈ విషయాన్ని పాక్ ప్రధాని దృష్టికి తీసుకెళతానని షమ్మీ సిల్వాకు హామీ ఇచ్చారు. శ్రీలంక విజ్ఞప్తిని పాకిస్థాన్ తిరస్కరించిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని, సోమవారం నాటికి దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.వాస్తవానికి పాకిస్థాన్ జట్టు టీ20 వరల్డ్ కప్‌లో ఆడేందుకు ఆ దేశ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, భారత్‌తో మ్యాచ్ ఆడకుండా నిబంధన విధించింది. దీంతో పీసీబీ ఈ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు ప్రకటించింది. గతంలో పాకిస్థాన్ పర్యటనలో తమ ఆటగాళ్లకు భద్రతాపరమైన ఆందోళనలు ఎదురైనప్పుడు, శ్రీలంక ప్రభుత్వం తమ జట్టును వెనక్కి పిలవకుండా టూర్‌ను పూర్తి చేసేలా ఆదేశించిందని, ఈ నేపథ్యంలో శ్రీలంక విజ్ఞప్తికి ప్రాధాన్యం ఏర్పడిందని విశ్లేషకులు అంటున్నారు.

# సొంత సంపాదన : ఈ టాలీవుడ్ హీరోల ఆస్తి ఎన్ని కోట్లంటే?



టాలీవుడ్ హీరోలు అంటే కేవలం వెండితెరపై మెరిసే నటులే కాదు, వారు పక్కా బిజినెస్ మైండ్ ఉన్న సంపన్న వ్యక్తులు కూడా. సినిమాల ద్వారా వచ్చే రెమ్యూనరేషన్‌తో పాటు రియల్ ఎస్టేట్, స్టూడియోలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ మరియు సొంత వ్యాపారాల ద్వారా వీరు భారీగా ఆర్జిస్తున్నారు. మన అభిమాన హీరోల సంపాదన ఏ స్థాయిలో ఉంది? బాక్సాఫీస్ వద్దే కాకుండా ఆస్తుల విషయంలోనూ ఎవరెవరు ఏ స్థానాల్లో ఉన్నారో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతి అభిమానికి ఉంటుంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.



**అగ్రస్థానంలో సీనియర్ స్టార్స్:**
టాలీవుడ్‌లో అత్యధిక ఆస్తులు కలిగిన హీరోల జాబితాలో కింగ్ నాగార్జున అగ్రస్థానంలో నిలుస్తారు. అన్నపూర్ణ స్టూడియోస్, కన్వెన్షన్ సెంటర్లు , ఇతర వ్యాపారాల ద్వారా ఆయన ఆస్తి సుమారు రూ. 800 నుండి 900 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇక మెగాస్టార్ చిరంజీవి సుమారు రూ. 650 నుండి 700 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారు. దశాబ్దాలుగా ఇండస్ట్రీని ఏలుతున్న ఈ సీనియర్ హీరోలు కేవలం సినిమాల ద్వారానే కాకుండా, తెలివైన పెట్టుబడులతో తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. వారి వెనకే విక్టరీ వెంకటేష్ (రూ. 120-150 కోట్లు), నందమూరి బాలకృష్ణ (రూ. 100-120 కోట్లు) కూడా భారీ స్థిరాస్తులతో కొనసాగుతున్నారు.

**గ్లోబల్ స్టార్స్ మరియు యువ హీరోల జోరు:**
ప్రస్తుత తరం హీరోల్లో మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్ మరియు ప్రభాస్ పోటాపోటీగా ఉన్నారు. మహేష్ బాబు తన సినిమాలతో పాటు ఏఎంబీ సినిమాస్, పలు బ్రాండ్ యాడ్స్ ద్వారా రూ. 350 నుండి 400 కోట్ల ఆస్తిని కలిగి ఉన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రూ. 350-370 కోట్లు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రూ. 350 కోట్లు, మరియు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా దాదాపు రూ. 350 కోట్ల మేర ఆస్తులు కలిగి ఉన్నట్లు సమాచారం. ఈ హీరోలు ఒక్కో సినిమాకు తీసుకునే భారీ రెమ్యూనరేషన్ వారి ఆస్తుల పెరుగుదలకు ప్రధాన కారణం అవుతోంది.

**మాస్ హీరోల ఆర్థిక సామ్రాజ్యం:**
మాస్ హీరోలుగా పేరు తెచ్చుకున్న జూనియర్ ఎన్టీఆర్ మరియు పవన్ కళ్యాణ్ కూడా ఆర్థికంగా బలంగానే ఉన్నారు. తారక్ ఆస్తి విలువ సుమారు రూ. 250 నుండి 300 కోట్ల వరకు ఉండగా, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆస్తుల విలువ రూ. 200 నుండి 250 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. వీరు కేవలం నటులుగానే కాకుండా వివిధ సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉంటూనే, తమ సంపాదనను పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. మొత్తానికి టాలీవుడ్ స్టార్స్ బాక్సాఫీస్ కలెక్షన్ల రేసులోనే కాదు, వ్యక్తిగత ఆస్తుల విషయంలో కూడా రికార్డులు సృష్టిస్తున్నారు.

ఈ గణాంకాలను చూస్తుంటే టాలీవుడ్ హీరోలు కేవలం నటనకే పరిమితం కాకుండా, ఒక పక్కా వ్యూహంతో తమ ఆర్థిక భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని అర్థమవుతోంది.

**పింక్ సాక్షి మాలిక్ సాఫ్ట్ గ్లామ్ మూమెంట్‌లో అందంగా ఉంది**



**నభా నటేష్ బ్లూ డ్రీమ్స్ మీకు నిద్రలేని రాత్రులను అందిస్తాయి**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965